భక్తిశ్రద్ధలతో చింతలరాయునికి చక్రస్నానం

ముగిసిన బ్రహ్మోత్సవాలు


కొలనులో స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణంలోని ప్రసిద్ధి చెందిన చింతలవెంకటరమణస్వామికి చక్రస్నానం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలరాయునికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని కొలనులో స్వామివారికి భక్తిశ్రద్ధలతో చక్రస్నానం చేయించారు. ఈనెల 10వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజావరోహణ, కుంబ ప్రోక్షణ పూజలతో ముగిశాయి. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.


ప్రత్యేకాలంకరణలో చింతల వెంకటరమణ స్వామి

పగలు ఎండ.. రాత్రి వర్షం

రాంనగర్(అనంతపురం): జిల్లాలో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పగలు పొడి, రాత్రి తడి వాతావరణం చోటు చేసుకుంది. 4 రోజులుగా గాలి లేకుండా వర్షం కురవగా శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈనెల సాధారణ వర్షపాతం 100.9 మి.మీలు కాగా, ఇప్పటికే 103.4 మి.మీల అత్యధిక వర్షం కురిసింది. మండలాల వారీగా వర్షపాతం పరిశీలిస్తే.. అనంతపురంలో 64.2 మి.మీల అత్యధిక వర్షం కురిసింది. బుక్కరాయసముద్రంలో 53.0, గార్లదిన్నె 46.6, బొమ్మనహాళ్ 26.0, పెద్దవడుగూరు 24.6, ఉరవకొండ 21.6, నార్పల 17.8, కూడేరు 12.4, పామిడి 12.2, శింగనమల 12.0, డి.హీరేహాళ్ 11.0 మి.మీల వర్షం కురిసింది. రాప్తాడు, ఆత్మకూరు, వజ్రకరూరు, గుంతకల్లు, యాడికి, శెట్టూరు, గుత్తి, బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, యల్లనూరు, కంబదూరు, రాయదుర్గం, విడపనకల్లు, బెళుగుప్ప మండలాల్లో చిరుజల్లులు పడ్డాయని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి అశోక్ తెలిపారు.

ఉద్యాన పంటల నష్టం రూ.96.37 లక్షలు

అనంతపురం(రాంనగర్): వర్షానికి బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట, బుక్కరాయసముద్రం, పామిడి, కూడేరు, కుందుర్పి మండలాల్లో మిరప, టమాటా, చీనీ, ద్రాక్ష తదితర పంటలకు నష్టం జరిగింది. మొత్తం 39 మంది రైతులకు సంబంధించి 149 ఎకరాల్లో రూ.96.37 లక్షల ప్రాథమిక నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి పంపినట్లు ఉద్యానశాఖ ఉపసంచాలకులు నరసింహారావు తెలిపారు.

వ్యర్థంలో అర్థం వెతికిన ఆర్డీటీ!


కందకం విధానంలో ఎరువుల తయారీ

- చెత్త నిర్వహణలో 'మన భూమి' భేష్
- ఎరువులు తయారు చేసి మొక్కలకు వినియోగం

స్ఫూర్తిగా తీసుకుంటే మేలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే

చిన్న మార్పు పెద్ద ప్రభావాన్ని చూపుతాయన్న సూక్తిని పాటిస్తోంది ఆర్డీటీ. మనం ఒకరికి నీతులు చెప్పడం కాదు.. మన నుంచే మంచి ప్రారంభం కావాలన్న లక్ష్యంతో మన భూమి అనే పథకానికి ఆర్డీటీ మూడేళ్ల క్రితమే శ్రీకారం చుట్టింది. అనంత నగరంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయం, టీవీ టవర్ సమీపంలోని మరో కార్యాలయం, క్రీడాగ్రామం, దివ్యాంగుల పాఠశాల, బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు, కూడేరు ఆసుపత్రులు, బుక్కరాయసముద్రం పాఠశాలల్లో చెత్త నిర్వహణ తీరు ఆదర్శంగా ఉంది. మూడు విధానాల్లో వ్యర్థాల నుంచి ఎరువులను ఉత్పత్తి చేస్తున్నారు. కందకాలు, ఆర్బిన్, మెష్ విధానాలు అమలు చేస్తున్నారు. తడి వ్యర్థాలు సేకరించడానికి ప్రత్యేకంగా డబ్బాలు ఏర్పాటు చేశారు. ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్‌ను ఆర్డీటీ ప్రాంగణాల్లో నిషేధించారు. ప్లాస్టిక్ నీళ్ల సీసాలు, సంచులు, చెంచాలు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వేరువేరుగా పోగు చేసి ఒక గదిలో భద్రపరుస్తారు. గది నిండిన తర్వాత గుజిరి వ్యాపారులకు విక్రయిస్తారు. చెత్త సేకరణ బట్టి మూడు లేదంటే నాలుగు నెలలకు ఒకసారి కుళ్లిన ఎరువును బయటికి తీసి మొక్కలకు ఉపయోగిస్తున్నారు.


ఆర్బిన్ విధానంలో ఎరువు ఉత్పత్తి

చెత్త సమస్యతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రహదారులు, కాలువలు... ఇలా ఎక్కడ చూసినా పండ్ల తొక్కలు, కుళ్లిన కూరగాయలు, ఆకుకూరలు, తినుబండారాలు పారబోస్తున్నారు. ప్రధానంగా హోటళ్లు, కల్యాణ మండపాలు, ఆసుపత్రులు, కూరగాయల మార్కెట్లు, వసతిగృహాల నుంచి టన్నుల కొద్దీ పడేస్తున్నారు. అనంతపురం నగరంలో దాదాపు అన్ని రకాల కల్యాణ మండపాలు సుమారు 250.. ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాలు 70 వరకు ఉన్నాయి. రోజూ నగరంలో 10 టన్నుల నుంచి 15 టన్నుల వరకు తడిచెత్త పోగవుతోందని అంచనా. దీన్ని తరలించడానికి నగర పాలక సంస్థకు భారంగా మారుతోంది. ఆర్బిన్, కందక, కంపోస్ట్ విధానంలో ఎరువు ఉత్పత్తి చేస్తే ఆదాయం వస్తుంది. టన్ను ఎరువు నాణ్యత బట్టి వేల రూపాయల ధర పలుకుతోంది. చెత్తతో సంపదను సృష్టించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే ఆర్డీటీ 'మన భూమి'ని స్ఫూర్తిగా తీసుకోవడం ఉత్తమం.

'మన భూమి'కి సేకరణ.. తయారీ ఎలాగంటే..

- ఆర్డీటీ కార్యాలయాలు, క్రీడా ప్రాంగణాలు, ఆసుపత్రుల్లో రోజూ సేకరిస్తున్న తడిచెత్త: 500 కిలోలు
- 3 నుంచి 4 నెలలకొకసారి ఉత్పత్తి చేస్తున్న ఎరువు: 5 టన్నులు
- రాలిన ఆకులు, కుళ్లిన పండ్ల, తొక్కలు, కూరగాయలు, ఆకుకూరలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలు.. తదితర వ్యర్థాలను కందకాలు, మెష్, ఆర్బిన్ విధానాల్లో ఎరువు తయారు చేస్తున్నారు.
- ప్రతి ప్రాంగణంలో సిబ్బంది వంతుల వారీగా పని చేస్తున్నారు. ప్రత్యేకంగా నిర్వహణకు నలుగురిని నియమించారు. స్పెయిన్‌కు చెందిన అరాంచ అనే మహిళా ఉద్యోగిని నేతృత్వం వహిస్తున్నారు.

అందరూ పాటిస్తే మంచి ఫలితాలు

విశాలఫెర్రర్, ఆర్డీటీ డైరెక్టర్



వ్యర్థాలనూ సక్రమంగా ఉపయోగించాలన్నదే ఆర్డీటీ అభిమతం. అందుకే మన భూమి అనే పథకం పేరిట వ్యర్థాలతో ఎరువులు తయారు చేస్తున్నాం. ఆర్డీటీ వివిధ కార్యాలయాల్లోని మొక్కలకు ఎరువులు వేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. అందరినీ ప్రోత్సహిస్తున్నాం. సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చాం. భవిష్యత్తులో వంటకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు పండించాలని ఆలోచిస్తున్నాం.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

పెండింగ్ ప్రాజెక్టులపై అంచనాలు సిద్ధం చేయండి

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : జిల్లాలోని హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలోని జీడిపల్లి కెనాల్ విస్తరణ పనులు 134 కి.మీ నుంచి 234.00 కి.మీల వరకు అంచనాలు సిద్ధం చేసి అందజేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. శనివారం సాయంత్రం అనంతపురం రాంనగర్ క్యాంపు కార్యాలయంలో సీఈ నాగరాజు, ఎస్ఈ దేసేనాయక్, ఈఈ శ్రీనివాస నాయక్‌తో సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 33, 34 ప్యాకేజీలు కింద 39 వేల ఎకరాలకు, 36వ ప్యాకేజీ కింద 80 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. ఆయా ప్యాకేజీల పనులకు ఎంత నిధులు అవసరముందో అంచనాలు తయారీ చేసి పది రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. కొట్టాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కింద ఉరవకొండ, విడపనకల్లు మండలాలకు సాగునీరు అందించేందుకు సిద్ధం చేసి డీపీఆర్‌పై మంత్రి సమీక్షించారు.

తాగునీటి సమస్యను రానివ్వొద్దు

ఉరవకొండ నియోజకవర్గ మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పయ్యావుల కేశవ్ ఆదేశించారు. తాగునీటిపై అధికారుల సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, బెళుగుప్ప, కూడేరు మండలాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు


పింఛన్ల తొలగింపు విషయంలో మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుతో వైకాపా జడ్పీటీసీ సభ్యుల వాగ్వాదం. చిత్రంలో ఎమ్మెల్యే పల్లె సింధూర

నిబద్ధతతోనే ప్రజా సమస్యల పరిష్కారం

జడ్పీ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: మండల, గ్రామ స్థాయిలో ఎంపికైన ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. రాజకీయ విభేదాలు పక్కనబెట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల నాయకులు కలిసి పనిచేయాలని సూచించారు. శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరై ప్రసంగించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ అధ్యక్షత వహించగా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూర, శ్రీసత్యసాయి జిల్లా డీఆర్వో కొండయ్య, ఇన్‌ఛార్జి సీఈఓ కొండయ్య, పలు మండలాల జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో చెరువులకు నీరు విడుదల సమయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వృథాను అరికట్టి పంటలకు ఎక్కువగా విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న గ్రామీణ సడక్ యోజన కింద మూడో విడతలో మంజూరైన రహదారుల పనులకు ప్రతిపాదనలు వెంటనే పంపాలన్నారు.

★ రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల కొత్త పింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమైందని అర్హులైన వారిని ఎంపిక చేయడానికి అధికారులు అన్ని నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ప్రతి జడ్పీ సమావేశానికి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు తప్పకుండా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మడకశిర బ్రాంచి కెనాల్‌కు నీరు వదలాలని కోరారు.

★ ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అరకొరగా సరఫరా చేస్తున్నట్లు పలువురు జడ్పీటీసీ సభ్యులు వాపోయారు. ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగుకు రైతులు సిద్ధమయ్యారని రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు విత్తనాలు రాలేదన్నారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

★ హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులు నింపాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. అవసరమైన మరమ్మతులు చేసి వృథా అరికట్టాలని కోరారు.

పింఛన్లు తొలగిస్తున్నారంటూ దుమారం

వృద్ధాప్య, దివ్యాంగులు, వితంతు పింఛన్ల తొలగింపుపై జడ్పీ ఉప ఛైర్‌పర్సన్ నాగరత్న, అనంతపురం జడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ మండిపడ్డారు. రాజకీయ కారణాలతో అర్హులను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. దివ్యాంగుల పింఛనుకు సంబంధించి తాఖీదు ఇచ్చిన వెంటనే తొలగించినట్లు అర్థం చేసుకుంటున్నారని అది సరికాదని వివరించారు.

నాణ్యత డొల్ల.. తింటే గుల్ల!

- ఆహార పదార్థాలు కల్తీ
- ఆకర్షణ కోసం రంగుల వినియోగం
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు

ఈనాడు అనంతపురం

పలు ఆహార పదార్థాల్లో హానికర రంగులు, పలుమార్లు వాడిన నూనెతో వంటకాలు, మాంసం నిల్వ.. తదితరాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు హోటళ్ల, రెస్టారెంట్లలో వెలుగుచూస్తున్నాయి. కల్తీ ఆహారంతో వ్యాపారం చేస్తూ కొందరు జేబులు నింపుకొంటున్నారు. ఫలితంగా ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కూరగాయలను కడగకుండానే వాడుతుండటంతో వాటిపై ఉన్న పురుగు మందుల అవశేషాలు ఆహార పదార్థాల్లో కలుస్తున్నాయి. ఇక బిర్యానీ, కబాబ్, గోబీ మంచూరియా, కొన్ని రకాల మిఠాయిల ఆకర్షణ కోసం సింథటిక్ రంగులు కలుపుతున్నారు. నూడుల్స్, ఫ్రైడ్‌రైస్‌లో టేస్టింగ్ సాల్ట్ వినియోగిస్తున్నారు. వాటి ప్రభావం జీర్ణక్రియ, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. మరోవైపు ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేస్తూ ప్రజారోగ్యాన్ని మరింత దెబ్బతీస్తున్నారు.


హానికర రంగులు కలిపి తయారుచేసిన చికెన్ కబాబ్

ఈ ఏడాది నమోదైన కేసులు ఇలా..

సురక్షితం కాని ఆహారం	09
నాసిరకం	05
ఇతర కేసులు	03

అదే నూనె పదేపదే..

ఒకసారి వినియోగించిన నూనెను వంటకాల్లో వాడటం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదు. ప్రధానంగా కబాబ్, బజ్జీ, జిలేబీల తయారీలో నూనెలను అనేకసార్లు వాడుతున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వద్ద టోటల్ పోలార్ కాంపొనెంట్స్ (టీపీసీ) పరికరాలు ఉంటాయి. తనిఖీకి వెళ్లినప్పుడు మరగబెడుతున్న నూనెలో పరికరాన్ని ముంచితే వినియోగానికి పనికొస్తుందా లేదా అనేది తెలిసిపోతుంది.

తనిఖీలకు సిబ్బంది కొరత

ఉమ్మడి అనంతపురం జిల్లా ఆహార భద్రతా విభాగంలో మొత్తం నలుగురు సిబ్బంది ఉన్నారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌తో పాటు ఆహార భద్రతా అధికారి ఒకరు ఉండగా మరో ఇన్‌ఛార్జి ఉన్నారు. అటెండర్లు ఇద్దరికి గాను ఒక్కరే ఉన్నారు. నిబంధనల మేరకు పట్టణాల్లో 50 వేల జనాభా, గ్రామీణ ప్రాంతాల్లో లక్ష జనాభాకు ఒక ఆహార భద్రతా అధికారి ఉండాలి. సిబ్బంది కొరతతో తనిఖీలు ఇబ్బందిగా మారాయి. దీనికితోడు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పొందిన ఎన్ఏబీఎల్ ల్యాబ్ లేకపోవడంతో నమూనాలను తెలంగాణలోని నాచారం పంపి పరీక్షలు చేయిస్తున్నారు. ఫలితాలు రావడానికి ఆలస్యమవుతుండటంతో వెంటనే చర్యలు తీసుకోలేకపోతున్నారు.


హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఆహార భద్రత అధికారి

కొన్ని ఉదంతాలు ఇవిగో..

- అనంత నగరం కోర్టు రోడ్డులోని ఓ బిర్యానీ సెంటర్‌లో పరీక్షించగా.. హానికర సింథటిక్ రంగులు కలిపినట్లు తేలింది. సుభాష్ రోడ్డులోని ఓ రెస్టారెంట్, వడియంపేట సమీపంలో ఓ హోటల్, రుద్రంపేట సమీపాన ఓ రెస్టారెంట్‌లో ఆహార భద్రతా అధికారులు తనిఖీ చేయగా.. అన్నింటిలోనూ మోతాదుకు మించి రంగులు వినియోగించినట్లు నిర్ధారణ కావడంతో నిర్వాహకులపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నారు.
- నగరంలోని ఓ జిలేబి విక్రయ కేంద్రంలో నమూనాలను ల్యాబ్‌కు పంపించి పరీక్షించగా.. సల్ఫర్ ఉన్నట్లు తేలింది. ఎక్కువసార్లు పాలిష్ చేసిన బెల్లం వాడటంతో సల్ఫర్ ఆనవాళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.
- టవర్‌క్లాక్ సమీపాన ఓ హోటల్‌లోని గోబీ మంచూరియాలో హానికరమైన రంగులు కలిపినట్లు పరీక్షలో తేలింది.
- తపోవనం సర్కిల్ సమీపాన ఉన్న టీ దుకాణంలో టీ పొడిని పరీక్షించగా అందులో క్రిమిసంహారక మందుల ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- తస్లిమా, ఆహార భద్రత అధికారి, అనంతపురం

ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. కొంతమంది హానికర రంగులు కలుపుతున్నట్లు తనిఖీల్లో తేలింది. వారిపై కేసులు నమోదు చేశాం. కొన్ని కేసులు కోర్టుల్లో ఉన్నాయి. సిబ్బంది కొరత ఉన్నా ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకుంటున్నాం.



చేప పిల్లల సంరక్షణకు వలలు

అనంతపురం జిల్లా మత్స్యశాఖ కార్యాలయ ఆవరణం మత్స్య క్షేత్రంలో నర్సరీలో ఈ సీజన్‌లో 42 సిమెంటు తొట్టెల్లో ఏటా 52 లక్షలు చేప పిల్లలు పెంచుతుంటారు. బోరు నీటితోనే రోహు, మృగాలు, కట్ల వంటి రకాల పిల్లలు పెంచారు. ఆ తర్వాత హెచ్చెల్సీ కెనాల్ నీటితో పెంచుతున్నారు. చేపపిల్లల వయసు రెండు నెలలు. ఇంకా నెల రోజులు పిల్లలు పెరగాల్సి ఉంది. తర్వాత మత్స్యసహకార సంఘాలకు, ఎంపిక చేసి నీటి జలాశయాలకు సరఫరా చేస్తారు. ఈ సమయంలో చేప పిల్లలపై కొంగలు, నీటి కోళ్ల బెడద అధికమైంది. తొట్టెల్లో దిగి నీటిలో మునిగి మరీ చేప పిల్లల్ని తినేస్తున్నాయి. దీంతో 42 తొట్టెలపై వలలు కట్టించి, సంరక్షిస్తున్నామని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

- న్యూస్‌టుడే, రాంనగర్(అనంతపురం)

అంగన్‌వాడీల్లో ఆరోగ్యం.. ఆనందం

- 'సక్షం' కింద 185 కేంద్రాల ఎంపిక
- రూ.84.73 లక్షలు మంజూరు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణి, బాలింతలకు సంపూర్ణ 'పోషణ' అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నాయి. మెరుగైన ఆరోగ్యం, ఆనందాన్ని పెంపొందించడానికి పటిష్ఠ కార్యాచరణను సిద్ధం చేశాయి. స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంటు (సక్షం) పథకం కింద తొలి విడతగా కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 2302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటే.. తొలి విడతగా కింద 185 కేంద్రాలను గుర్తించినట్లు ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి వెల్లడించారు.

ఒక్కో కేంద్రానికి రూ.45,800

ఒక్కో కేంద్రానికి రూ.45,800 చొప్పున రూ.84.73 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో పోషణ వాటిక (పెరటి తోట) కోసం రూ.10 వేలు, ఇంకుడు గుంత కోసం రూ.16 వేలు, విద్య, ఆటల సామగ్రి కొనుగోలుకు రూ.19,800 ప్రకారం కేటాయించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణానికి 1233 పనుల కోసం రూ.3.26 కోట్లు మంజూరీ చేసింది. ఇపుడు అదనంగా ఆ 185 కేంద్రాలకు రూ.84.73 లక్షలు మంజూరు కావడం విశేషం.



ప్రాజెక్టుల వారీగా ఎన్ని కేంద్రాలు

అనంత గ్రామీణం	25
గుత్తి	14
కళ్యాణదుర్గం	05
కణేకల్లు	24
కంబదూరు	04
నార్పల	16
శింగనమల	22
రాయదుర్గం	06
తాడిపత్రి	47
ఉరవకొండ	22

సమకూర్చే సదుపాయాలివే..

బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు తగిన వసతులు సమకూర్చడం. కేంద్రాల ఆవరణల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించడం. విద్యా, ఆటల సామగ్రి కల్పించడం. ఆట వస్తువులతో మెరుగైన విద్యాబోధన చేయడం. కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం..

పెరటి తోటల పెంపకం

కేంద్రాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తారు. పండ్ల మొక్కలు పెంచుతారు. స్థలం లేకపోతే కుండీల్లో పండిస్తారు. వాన నీటిని సంరక్షించేందుకు ఇంకుడు గుంతలు తవ్వుతారు. రక్షిత నీటిని అందించేలా ఏర్పాట్లు చేస్తారు. ఈ బాధ్యతను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



పోలీసు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమణమూర్తి

అనంత నేరవార్తలు: విధి నిర్వహణలో వివిధ కారణాలతో పోలీసులు మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబ సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందని అదనపు ఎస్పీ (అడ్మిన్) డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్ కన్వెన్షన్ హాలులో విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులతో అదనపు ఎస్పీ సమావేశమయ్యారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల గురించి, కుటుంబ స్థితిగతులు, బాగోగులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మూడేళ్ల కష్టం.. నేలపాలు



కూడేరు మండలం హంసాపల్లిలో రైతు శ్రీనివాసులు రెండు ఎకరాల్లో ద్రాక్ష సాగు చేశారు. మూడేళ్లు అహర్నిశలు శ్రమించి, పంటను కాపాడుకున్నారు. పెట్టుబడి రూ.15లక్షల దాకా పెట్టారు. ద్రాక్ష విరగ్గాసింది. తొలికాపు చేతికొస్తుందంతో ఆయన ఎంతో సంతోషించారు. తెల్లవారితే కోత కోయాలి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పందిరి మీద ఉన్న తోట ఒక్కసారిగా కుప్పకూలింది. పెట్టుబడితోపాటు శ్రమ నేలపాలు కావడంతో రైతు కన్నీటి వేదన వర్ణనాతీతం. ఉద్యాన డివిజన్ అధికారి నెట్టికంటయ్య ద్రాక్ష తోటను పరిశీలించి, రైతు వివరాలు సేకరించారు. - న్యూస్‌టుడే, కూడేరు(ఉరవకొండ)

గోతులు చూస్తే గుండె గుబేలు

కళ్యాణదుర్గం- బళ్లారి అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి ఇది. వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు భారీ గుంతలు పడ్డాయి. వాటిని చూడగానే వాహనదారుల గుండెలు అదురుతున్నాయి. వేపరాళ్ల క్రాస్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. ఇటీవల వేపరాళ్ల చెరువుకట్ట కింద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి గుంతలను తప్పించే క్రమంలో లారీ కింద పడి దుర్మరణం పాలయ్యారు. ఆర్‌అండ్‌బీ జేఈ నాగేంద్రప్రసాద్ వివరణ కోరగా మరమ్మతులకు రూ.40లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి పూర్తి చేయిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, రాయదుర్గం గ్రామీణం



నాడు-నేడు.. గడ్డ కట్టెను చూడు!




అనంతపురం గ్రామీణం పాపంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పనులు కింద తరగతి గదుల మంజూరు చేశారు. సామగ్రి సరఫరా చేశారు. పనులు చేపట్టారు. ఉపాధ్యాయులు గదుల కొరత తీరుతుందని భావించారు. అంతలోనే గదుల నిర్మాణాలు ఆపేశారు. అప్పట్లో మంజూరైన 250 బస్తాల సిమెంటు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల గదిలో నిల్వ చేసి, టార్పాలిన్ కప్పి ఉంచారు. ఏడాదిన్నర క్రితం నుంచి పట్టించుకోకపోవడంతో సిమెంటు బస్తాలు గడ్డకట్టి పనికి రాకుండా పోయాయి. - న్యూస్‌టుడే, రాంనగర్ (అనంతపురం)

జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి రాజీనామా

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తన పదవికి రాజీనామా చేశారు. ఇంకా ఒక ఏడాది పాటు పదవీకాలం ఉన్నా అర్ధాంతరంగా రాజీనామా చేయడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. శనివారం తన రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డికి ఆయన అందజేశారు. ఇటీవల ప్రకటించిన అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక దుమారం రేపింది. కార్యదర్శిగా ఉంటూ తన కుమారుడిని ఉప సారథిగా ఎంపిక చేయడమేంటని పలువురు తీవ్రంగా తప్పుబట్టారు. కొందరు ఏసీఏ కార్యవర్గ సభ్యులకు ఫిర్యాదు చేశారు. గత నెలలో దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలకు జిల్లా ఆతిథ్యమిచ్చింది. ఈ పోటీలు విజయవంతంగా ముగిసిన కొందరు క్రికెటర్లు కార్యదర్శిపై కన్నెర్ర చేశారు. జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు, శిక్షకులు, మండల క్రికెట్ సంఘాల సభ్యులు తమ పిల్లలను ఆడించాలన్న ఆరాటంతో ప్రతిభకు పాతరేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ లొటుపాట్లపై ఇటీవల 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో పలువురు స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్ర క్రికెట్ సంఘంలోనూ అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. మహిళా విభాగం ఆపరేషన్ మేనేజరుగా ఉన్న మచ్చా రామలింగారెడ్డి సైతం ఇటీవల పదవికి రాజీనామా చేశారు. అతని కుమారుడు దత్తారెడ్డి గత నెలలో రంజీ జట్టుకు ఎంపిక కాగా ఈసారి కనీసం రాష్ట్ర అండర్-23 జట్టుకు కూడా ఎంపిక కాకపోవడంతో చర్చనీయాంశమైంది.

మృతి వార్తతో చలించి.. బాధితుల్ని ఓదార్చి



వెబెక్స్ ద్వారా జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అనంతపురం: జీవిత, ఆరోగ్య బీమాపై శనివారం దిల్లీలో అన్ని రాష్ట్రాల ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మంత్రులతో జరిగిన సమావేశానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కావాల్సిన తరుణంలో బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ నేరుగా పాల్గొనాల్సి ఉంది. అదే సమయంలో తెదేపా నాయకుడి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వార్త అందింది. రాత్రికి రాత్రి విజయవాడ నుంచి బయలుదేరి ఉరవకొండకు రావాల్సి వచ్చింది. ఆ సమావేశానికి ప్రత్యక్షంగా హాజరు కాలేనని అనుమతి తీసుకొని ఉదయం బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. తర్వాత అనంతరం సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో ల్యాప్‌టాప్ నుంచి వెబెక్స్ ద్వారా సమావేశంలో హాజరై రాష్ట్ర తరఫున మాట్లాడారు. బీమా ప్రీమియంపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని సూచించినట్లు పయ్యావుల కేశవ్ తెలిపారు. ఫలితంగా బీమా పాలసీలు సామాన్యులకు అందుబాటులోకి వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజినల్ బిజినెస్ ఆఫీస్ - 4, ధర్మవరం.

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా "స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" ఈ క్రింది బ్రాంచీలలో "బంగారు నగలు" తాకట్టుపెట్టి అప్పు తీసుకొన్న ఈ దిగువ తెలిపిన ఖాతాదారులు గడువు మీరినను, పలుమార్లు కోరినను, అప్పు తిరిగి చెల్లించనందులకు రిజర్వు బ్యాంకు వారి నిబంధనల ప్రకారం దిగువ కనబరిచిన షెడ్యూలు ప్రకారం **29-10-2024 తేది మంగళవారం సా॥ 4.30 గం॥లకు ఆయా బ్రాంచ్‌ల ఆవరణలలో బహిరంగ వేలము వేయబడును.**

క్ర. సం.	ఖాతాదారుని పేరు, చిరునామా	అకౌంట్ నెంబర్	అప్పు మొత్తం (సుమారుగా) రూ॥
	ACB కళ్యాణదుర్గం, బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం: 9391139057		
1	బి.వెంకటేశులు, తండ్రి: బోయ హనుమంతప్ప, 7/3, కామక్కపల్లి, కళ్యాణదుర్గం	41847658268	65,000/-
2	అనిల్‌కుమార్ బోయ, గాజులపల్లి నారాయణపురం, 1-85, కళ్యాణదుర్గం	43010971685	73,000/-
3	కౌస్తుభ మీనన్, తండ్రి: ఎం.గురుప్రసాద్, డి.నెం.9ఎ-138, వెంకటమ్మ థియేటర్ దగ్గర, కళ్యాణదుర్గం	40358486200	49,081/-
4	బి.యశోదమ్మ, భర్త: బి.పన్నూరుస్వామి, 1-278, బీసీ కాలనీ, పాలవాయి, కళ్యాణదుర్గం	40384148827	26,029/-
5	పెద్దింటి బొమ్మలింగప్ప, తండ్రి: పెద్దింటి పీరప్ప, డి.నెం. 3-36, బీసీ కాలనీ, కొత్తూరు గ్రా, కళ్యాణదుర్గం మం॥	43093437952	95,000/-
6	సుగాలి తిప్పేస్వామి, తండ్రి: సుగాలి సక్రానాయక్, డి.నెం. 9-102, పాలవాయి, కళ్యాణదుర్గం	43117172844	50,000/-
	ACB గోరంట్ల, బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం: 8008550580		
7	రమావత్ నరసింహానాయక్, డి.నెం. 1-59, బూదిలివాండ్లపల్లి తాండ, జక్కసముద్రం, గోరంట్ల.	39926821983	62,000/-
8	కృష్ణమూర్తి గాధి, డి.నెం. 5-30, కాజాపురం, మందలపల్లి, గోరంట్ల.	40318265619	53,917/-
9	వెంకటరమణప్ప కుర్రా, డి.నెం. 6-105, వానవోలు, గోరంట్ల.	40342180246	41,653/-
10	నరసమ్మ జి.ఎల్, భర్త: గంగాద్రి, కొలిమిపల్లి గ్రా, వానవోలు, గోరంట్ల మం॥	42694255059	60,000/-
11	వడితే సుబాబాయి, భర్త: వి.వెంకటేశ్‌నాయక్, డి.నెం. 8, కరావులపల్లి తాండ గ్రా, గోరంట్ల.	43171490307	2,45,000/-
12	చెన్నకేశవనాయక్ సుగాలి, డి.నెం. 3-268, కరావులపల్లి, మందలపల్లి, గోరంట్ల.	41125127341	83,877/-
13	ఎం.విష్ణువర్ధనరెడ్డి, ఎంపీ ఇంటి ఎదురుగా, మెయిన్‌రోడ్డు, గోరంట్ల.	42940287479	3,30,000/-
14	ఎం.విష్ణువర్ధనరెడ్డి, ఎంపీ ఇంటి ఎదురుగా, మెయిన్‌రోడ్డు, గోరంట్ల.	42940028413	1,89,000/-
15	కె.దుబ్బానాయక్, తండ్రి: ధరంసింగ్‌నాయక్, కరావులపల్లి తాండ గ్రా, గోరంట్ల మం॥	40823954067	1,02,205/-
16	సి.అరుణ, డి.నెం. 1-1805, చౌడేశ్వరి కాలనీ, గోరంట్ల.	40421268917	36,351/-
17	రంగానాయక్ వడిత్యా, డి.నెం. 5-90, దిగువగంగంపల్లి తాండా గ్రా, గోరంట్ల మం॥	40440340334	95,549/-
	ACB శెట్టిపల్లి, బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం: 8297666933		
18	హరిజన హరీష్, తండ్రి: సుబ్బన్నగారి నారాయణప్ప, డి.నెం. 6-117, బుగ్గపల్లి గ్రా, పుట్టపర్తి మం॥	40522894610	20,715/-
19	హరిజన హరీష్, తండ్రి: సుబ్బన్నగారి నారాయణప్ప డి.నెం. 6-117, బుగ్గపల్లి గ్రా, పుట్టపర్తి మం॥	40428847953	32,197/-
	OD చెరువు, బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం: 9963784794		
20	బద్రి రాజమ్మ, డి.నెం. 4-111-1, బద్రికుంట్లపల్లి, ఓడిచెరువు మం॥	39995609067	2,72,000/-
21	కె.హేమలత, తండ్రి: వి.హరినాథ్, డి.నెం. 3-70-1, బీసీ కాలనీ, ఓడిచెరువు.	42224934241	1,70,000/-
	టౌన్ బ్రాంచ్ హిందూపురం, బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం: 9000475547		
22	జిల్లేడుగుంట ఎస్.రామాంజి, డి.నెం. 13-15-430, శ్రీవిద్యానగర్, హిందూపురం	42635862937	15,000/-

వేలం షరతులు: 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ॥ 10,000/- ధరావత్తు కట్టి వేలములో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తమును అదే రోజు నగదును చెల్లించి నగలను పొందవలెను. 3) ఈ ఖాతాదారుడు మరణించిన యెడల అతని వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 4) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును. 5) వేలం ద్వారా వచ్చిన సొమ్ము బాకీ మొత్తమునకు సరిపోనియెడల చట్టరీత్యా చర్యలు తీసుకొని మిగిలిన బాకీ మొత్తము రాబట్టుకొనబడును. 6) వేలం పాటలో పాల్గొనదలచినవారు ఏదైనా ఫోటో గుర్తింపు కార్డుతో రావలెను. 7) ఇందలి ఖాతాదారునకు ఏ ఇతర ఋణములు ఉన్నచో మిగిలిన సొమ్ము ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. 8) ఈ ప్రకటనకు అయ్యే ఖర్చు పైన తెలిపిన ఖాతాదారుని నుంచి వసూలు చేయబడును. 9) నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకువారికి పూచీలేదు.

గమనిక: ఏ విధమైన కారణం చూపకుండానే షరతులు మార్చుకొనుటకుగానీ, వేలం వాయిదా వేయుటకుగానీ, వేలం రద్దు చేయుటకు గానీ ఆయా బ్యాంకు మేనేజర్ల గారికి పూర్తి అధికారము కలదు.

తేది: 19-10-2024 — సం/- రీజినల్ మేనేజర్
స్థలం: ధర్మవరం — స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, R.B.O-4, ధర్మవరం

రైతు ఉత్పత్తిదారు సంఘాలు బలోపేతం కావాలి

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే: జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవో) బలోపేతం కావాలని నాబార్డు డీడీఎం అనురాధ కోరారు. శనివారం అనంతపురం గ్రామీణం కురుగుంట ఉమ్మడి వ్యవసాయ క్షేత్రంలో రెడ్స్ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాబార్డు డీడీఎం అనురాధ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్‌పీవో ప్రాధాన్యం, ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. వారు ప్రకృతి వ్యవసాయం కింద పండించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర వచ్చేలా చూడాలన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతోందన్నారు. రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజా మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో మహిళా రైతులకు ప్రోత్సహించాల్సిన సంస్థ ప్రధాన ఉద్దేశమన్నారు. ఒంటరి మహిళలకు, వితంతువులకు ఆయా కుటుంబాల్లో భూమి హక్కు, భూములు బదలాయింపులు జరగాలని ఆమె కోరారు. అనంతరం 50 మంది మహిళా రైతులను కప్పి సన్మానించారు.



మహిళా రైతును సన్మానిస్తున్న నాబార్డు డీడీఎం అనురాధ, భానుజ, తదితరులు

అత్యాచార బాధితుల వాంగ్మూలం నమోదు

ఉరవకొండ, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో ఈ నెల 12న దుండగుల చేతిలో సామూహిక అత్యాచారానికి గురైన అత్త, కోడలును పోలీసులు శనివారం ఉరవకొండ కోర్టుకు తీసుకువచ్చారు. బాధితుల వాంగ్మూలాన్ని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకళ్యాణి నమోదు చేశారు. వీడియోగ్రఫీ ఆధారంగా ఈ ప్రక్రియ చేపట్టారు. నిందితులకు వేగవంతంగా శిక్ష పడేలా చేయడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

నేడు జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

గుంతకల్లు, న్యూస్‌టుడే : బాలబాలికల జిల్లా ఖోఖో జట్ల ఎంపిక ఆదివారం స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో జరుగుతుందని ఖోఖో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారెడ్డి, జిల్లాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కార్యదర్శి నిరంజన్ రెడ్డి, ఛైర్మన్ నర్ర కేశన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికల వయసు 18 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఎంపికైన జట్లు చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈనెల 25 నుంచి మూడ్రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 99661 17447 చరవాణి నంబరును సంప్రదించాలని, ఉత్సాహవంతులైన క్రీడాకారులు ఎంపికలో పాల్గొనాలని కోరారు.

సీవీఆర్‌టీలో అక్రమాలు నిగ్గు తేల్చాల్సిందే:తెదేపా



కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న తెదేపా శ్రేణులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణ పరిసరాల్లోని సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న అక్రమాలను నిగ్గు తేల్చాల్సిందేనని తెదేపా నాయకులు పట్టుబట్టారు. శనివారం రెండోరోజు వారు కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. న్యాక్ బృందం వాహనాన్ని అడ్డుకొని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, నాయకుల మధ్య తోపులాట చోటుచేసుకుని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనలో తెదేపా నాయకురాలు కమలమ్మ గాయపడగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాంతో న్యాక్ బృందం సభ్యులు వెనుదిరిగారు. కళాశాలలో అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేసినా న్యాక్ బృందం ఎటువంటి చర్యలు తీసుకోలేదని, వారిని కళాశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా అనంతపురంలో కలిశారని తెదేపా నాయకులు ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ) ...విశ్వాసానికి మరోపేరు

సర్కిల్ శాస్త్రా సెంటర్
9-35, కావూరి టవర్స్, కామయ్య తోపు,
కానూరు, విజయవాడ-520007
మొబైల్ నెం. : 98312 00669, ఈ - మెయిల్ : cs8332@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) r/w 9(1) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు), హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

1) ఋణగ్రహీత పేరు / బ్యాంకుకు మొత్తం బకాయిలు : మెస్సర్స్ డి కె ఎంటర్ ప్రైజెస్, ప్రొప్రయిటర్ గా ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ఆకులేటి లక్ష్మీసువర్ణ, (ఖాతా నెం.6089008700000275, 608900IL00000017)

15-437-2, అప్ స్టైర్ 80 అడుగులు రోడ్డు, సూర్యనగర్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515001. — బ్రాంచ్ ఆఫీస్ : అనంతపురం - (608900)
& శ్రీమతి ఆకులేటి లక్ష్మీసువర్ణ, డి.నెం.17-996, ఓల్డ్ టౌన్, వేణుగోపాల్‌నగర్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515001.

డిమాండ్ నోటీసు తేది : 17-05-2023 ప్రకారం **తేది.30-06-2024** నాటికి **బకాయి రూ.58,15,754.9 పై.** (అక్షరాల యాభై ఎనిమిది లక్షల పదిహేను వేల ఏడు వందల యాభై నాలుగు రూపాయల తొమ్మిది పైసలు మాత్రమే) మరియు **తేది.01-07-2024** నుండి తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలు మరియు ఇతర ఖర్చులు (డిమాండ్ నోటీసు తరువాత ఏవైనా చెల్లింపు ఉన్న యెడల మినహాయించబడును).
లాంఛనాత్మక స్వాధీనతా తేది : 07.10.2023

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 06.11.2024, సాయంత్రం 4 గం॥ల లోపు | బిడ్ పెంపుదల మొత్తం రూ.50,000/-

ఇ-వేలం తేది, సమయం : 06-11-2024 ఉ॥ గం॥ 11.00 నుండి మ॥ గం॥ 4.00 వరకు

సెక్యూరిటీ / ఆస్తి వివరాలు మరియు ఆస్తి యజమాని/తనఖాపెట్టిన వ్యక్తి పేరు	రిజర్వు ధర రూ.	బయానా (ఇఎమ్‌డి)
అనంతపురం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ మరియు సబ్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, అనంతపురం పరిధిలోని, అనంతపురం మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా లోని అనంతపురం పరిధి నందలి గల జానకిరామ్ నగర్ నందు రెసిడెన్షియల్ ఖాళీ స్థలము ఆస్తి దిగువ చూపినవిధంగా బాబు- ప్రభుత్వ-మెట్ట; వార్డు 1; యస్.నెం. 122/సి; విస్తీర్ణం 1-50పైకి; విస్తీర్ణం 0-13.50 పైకి; విస్తీర్ణం ఎ.0-05.64; హెచ్.యస్. 0-022 హద్దులు : తూర్పు : కె.యమ్.గౌస్ పీరా గారి ఆస్తి, పడమర : 20 అడుగులు రోడ్డు, ఉత్తరం : 15 అడుగులు రోడ్డు, దక్షిణం : 33 అడుగులు రోడ్డు. కొలతలు : తూర్పు-పడమర : ఉత్తరం వైపు : 37 అడుగులు లేదా 11.27 మీటర్లు, తూర్పు-పడమర : దక్షిణం వైపు : 50 అడుగులు లేదా 15.24 మీటర్లు, ఉత్తరం-దక్షిణం : తూర్పు వైపు : 66 అడుగులు లేదా 20.12 మీటర్లు, ఉత్తరం-దక్షిణం : పడమర వైపు 47 అడుగులు లేదా 14.32 మీటర్లు. ఏరియా : 273.08 చ.గ.లు , సమీప డి.నెం.1-4-90	రూ. 51.50 లక్షలు	రూ. 5.15 లక్షలు

ఇ-వేలం నియమ నిబంధనలు :
1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2) ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి.
3) అధీకృత అధికారి గారి వద్దగల షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారు సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4) అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://ebkray.in & www.pnbindia.in. ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.06-11-2024, ఉదయం గం.11-00 ల నుండి సాయంత్రం గం.4-00 ల వరకు నిర్వహించెదరు.
5) అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయజేసి https://ebkray.in & www.pnbindia.in. వెబ్‌సైటులు చూడవలెను.

సర్ఫేసి చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

ప్రదేశం: విజయవాడ, తేది : 16-10-2024 — సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

తల్లిదండ్రులు తిట్టారని రైలు ఎక్కారు

• అనంతలో బాలిక, గుంతకల్లులో బాలుడు ప్రత్యక్షం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తిట్టారన్న కోపం, క్షణికావేశంతో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు పిల్లలు రైలు ఎక్కారు. చివరకు రైల్వే పోలీసులు సకాలంలో గుర్తించి చైల్డ్ లైన్ 1098కు అప్పగించి తర్వాత తల్లిదండ్రుల వద్దకు చేర్చడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి.

● ధర్మవరం పట్టణానికి చెందిన 14 ఏళ్ల లహరి ఓ విషయంలో తల్లిదండ్రులు మందలించారన్న కోపంతో శుక్రవారం సాయంత్రం అనంత వైపు వచ్చే రైలు ఎక్కింది. అనంత రైల్వేస్టేషన్‌లో దిగి అనుమానాస్పదంగా తిరగడంతో అక్కడి రైల్వే పోలీసులు గమనించి బాలికతో మాట్లాడారు. సత్వరమే చైల్డ్‌లైన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సదరు బాలికను తీసుకొచ్చి తాత్కాలికంగా బాల సదన్‌లో చేర్చారు. ఈలోపు బాలిక చెప్పిన వివరాలను ధర్మవరం సీఐ రెడ్డప్పకు సమాచారం అందించి కుటుంబీకుల చెంతకు చేర్చారు.

● మరో ఘటనలో తల్లిదండ్రులు, అక్క తిట్టారన్న కోపంతో హైదరాబాద్ నగరం ఆసిఫ్‌నగర్‌కు చెందిన 14 ఏళ్ల మహేశ్ శుక్రవారం సికింద్రాబాద్‌లో రైలు ఎక్కి గుంతకల్లులో దిగాడు. ఇక్కడి విధుల్లో ఉన్న సీఐ ఒకరు ఆ బాలుడిని గమనించి వివరాలు ఆరా తీశారు. బాలుడి చెప్పిన వివరాల ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం చెప్పారు. శనివారం ఉదయం వారు గుంతకల్లుకు చేరుకోవడంతో వారికి అప్పగించారు.

రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

వైభవంగా ప్రసన్నవేంకటేశ్వర స్వామి కల్యాణం

రాయదుర్గం: పట్టణంలో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. బ్యాండు గోవిందప్ప ఆధ్వర్యంలో కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం, వేంకటేశ్వర అష్టోత్తర శతనామావళి, తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బీటీ ప్రాజెక్టుకు జలకళ

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: భైరవానితిప్ప ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1,655 అడుగులు కాగా ప్రస్తుతం 1,650 అడుగుల మేర నీరు చేరింది. కర్ణాటక ప్రాంతంలో కురిసిన వర్షాలకు ప్రస్తుతం 1,020 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దాంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జలాశయంలో పెరిగిన నీటి మట్టం

గడేహోతూరులో అంధకారం

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండలంలోని గడేహోతూరు గ్రామంలోని ఎస్సీ, కురుబ కాలనీల్లో రెండు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. భాస్కర్ ఇంటి నుంచి రాకెట్ల తిమ్మప్ప ఇంటి వరకు ఉన్న ఆరు స్తంభాలకు, ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ స్కూల్ పరిసర ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ, గడేహోతూరు-గుంతకల్లు ప్రధాన రహదారిలోని ఎల్లమ్మ కట్ట నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను గ్రామ కార్యదర్శి సుభానీ రావ్, సర్పంచి సురేంద్ర దృష్టికి తీసుకెళ్లామని, వారు ఎనర్జీ అసిస్టెంట్ చందుకు చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

టీపీఎస్ బాధ్యతల స్వీకరణ

రాయదుర్గం: పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్‌గా మురళీమోహన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంతకల్లు పురపాలక సంఘం నుంచి రాయదుర్గానికి బదిలీపై వచ్చారు.

వర్షం.. పంటలకు నష్టం

ఆందోళనలో రైతులు



ముద్దినాయనపల్లిలో వర్షానికి తడిసి రంగు మారిన వేరుసెనగ కట్టె

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా మంది రైతులు వేరుసెనగ తొలగించి పొలాల్లో కుప్పలుగా వేసుకున్నారు. అవి మొలకలు వచ్చి పనికి రాకుండా పోయాయని పలువురు వాపోతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా వేరుసెనగ 600 ఎకరాల్లో, కంది 350, ఆముదం 90, టమాటా 800, మిరప 300 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. వేరుసెనగ కట్టె పశువులకు మేతకు కూడా పనికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏడీఏ యల్లప్పను వివరణ కోరగా ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఇప్పటికే 50 శాతం పూర్తి అయ్యాయి. మిగిలిన పంటలు చివరి దశలో ఉన్నాయి. వర్షాల కారణంగా నష్టం వాటిల్లితే కంట్రోల్ రూంకు సమాచారాన్ని అందించాలి. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు.

కాయలు మొలకలొచ్చాయి



ఐదెకరాల్లో వేరుసెగన పంట సాగుకు సుమారు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. వారం రోజుల కింద పంటను తొలగించగా వర్షం కురిసింది. వాముగా వేసిన చోట వేరుసెనగ కాయలు మొలకలు వచ్చాయి. 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా ధర రూ.6వేలు నుంచి రూ.7 వేలు పలుకుతుంది. ఆ లెక్కన సుమారు రూ.7 లక్షల వరకు చేతికొచ్చేవి. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. **- శ్రీనివాసులు, ముద్దినాయనపల్లి**

టమాటాకు మచ్చలొచ్చాయి..



ఎకరా కౌలుకు ఏడాదికి రూ.5వేలు చొప్పున ఆరెకరాల్లో పంటలు సాగు చేశాను. టమాటా సాగుకు రూ.2.10 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. ఇప్పటికే మూడెకరాల్లో పంట పూర్తిగా నష్టపోయాను. మరో మూడెకరాల్లో పంట కాయదశలో ఉండగా వర్షాలు కురవడంతో రంధ్రాలు పడి, మచ్చలు ఏర్పడ్డాయి. కోలుకోలేని దెబ్బ పడింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.
- ఆదినారాయణ, తిమ్మగానిపల్లి, కళ్యాణదుర్గం మండలం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071



సమస్య: కణేకల్లు క్రాసింగ్ నుంచి కణేకల్లు వెళ్లే మార్గంలో కంప చెట్లు పెరిగి రోడ్డుపైకొచ్చాయి. వాటిని తొలగించాలి. **- సోమశేఖర్**
సమాధానం: అనుమతులు రాగానే తొలగించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.
- రవిశంకరరెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ – న్యూస్‌టుడే, కణేకల్లు

సమస్య: రాయదుర్గం పట్టణంలోని అనంతపురం ప్రధాన రహదారి నుంచి రాజీవ్‌గాంధీ కాలనీ వైపు వెళ్లే దారిలో వాల్వ్ మరమ్మతులకు గుంత తవ్వి వదిలేశారు, పూడ్చివేయాలి. **- వెంకటేశ్**
సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం. **- జగన్నాథ్, ఫిట్టర్**
– న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

సమస్య: కళ్యాణదుర్గం తహసీల్దారు కార్యాలయ సమీపంలో రోడ్డుపై పడిన గుంతలను పూడ్చాలి. **- అన్వర్‌బాషా**
సమాధానం: ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. అనుమతులు రాగానే మరమ్మతులు చేయిస్తాం. **- ప్రసాద్, ఆర్అండ్‌బీ డీఈ**
– న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

ఇంజినీర్లకు విధుల కేటాయింపు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలో ఇటీవల విధుల్లో చేరిన మున్సిపల్ ఇంజినీర్లకు విధులు కేటాయించారు. తాగునీరు, పారిశుద్ధ్య వాహనాల నిర్వహణ ఏఈ నరసింహులుకు అనిరకాల అభివృద్ధి పనులు, వీధి దీపాల నిర్వహణ బాధ్యతలు ఏఈ ప్రతాప్‌కు అప్పగించారు. అన్న క్యాంటీన్, ఎస్‌టీపీ ప్లాంట్, గైడెన్స్‌లో భాగంగా పర్యవేక్షణ, కాంపోస్ట్ యార్డ్ నిర్వహణ తదితర పనులను సచివాలయం ఇంజినీరింగ్ కార్యదర్శి కోదండరామయ్యకు అప్పగించారు. మున్సిపల్ డీఈగా రవిప్రకాష్ నాయుడు బాధ్యతలు చేపట్టారు. పురపాలక సంఘంలో పరిపాలనలో పారదర్శకత, సౌలభ్యం కోసం కంప్యూటర్ ఆపరేటర్లను కూడా మార్చారు.

విద్యార్థినులకు అందుబాటులోకి మరుగుదొడ్లు

విడపనకల్లు(ఉరవకొండ): విడపనకల్లు మండలం పాల్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సదుపాయార్థం కొచ్చిన్‌కు చెందిన సింథైట్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ మరుగుదొడ్లను నిర్మించింది. వాటిని శనివారం అందుబాటులోకి తెచ్చారు. వీటి నిర్మాణానికి రూ.2లక్షలు ఖర్చు పెట్టినట్లు కంపెనీ మేనేజర్ మనోహర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తోడ్పాటుగా ఉండాలన్న ఉద్దేశంతో మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు. కంపెనీ ప్రతినిధులను హెచ్ఎం చంద్రమంగళ అభినందించారు. కార్యక్రమంలో ఎరువుల దుకాణ యజమాని గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న ఉద్యోగమేళా

ఉరవకొండ, న్యూస్‌టుడే: మండలంలోని చిన్న ముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 25న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ అష్రఫ్‌అలీ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. ఐటీఐ, ఇంటర్ ఆపైన చదువుకున్న నిరుద్యోగులు మేళాకు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 70138 00115 నంబరులో సంప్రదించాలన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి దుర్గాకల్యాణి

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ఉరవకొండ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి వార్డెన్లకు సూచించారు. పట్టణంలోని బాలికల వసతిగృహాలను ఆమె శనివారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. వసతులను పరిశీలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉరవకొండ, న్యూస్‌టుడే: సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా గోవిందప్ప, అధ్యక్షుడిగా మలరాయుడు, ప్రధాన కార్యదర్శిగా చెన్నరాయుడు, సహాయ కార్యదర్శిగా హనుమంతప్ప, ఉపాధ్యక్షులుగా ఎర్రిస్వామి, వనజమ్మతో పాటు మరింత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు చెప్పారు.



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ఆర్డీటీ సిబ్బంది

ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని గోవిందవాడ గ్రామంలో శనివారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజుహరిష, ఎస్‌బీఎల్ వసంత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు ర్యాలీ, మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. [illegible] అనంతరం బాలికలకు బెలూన్ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. **వజ్రకరూరు:** మండలకేంద్రంలోని శ్రీజనార్దన వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏకాలజీ డైరెక్టర్ విజయ్ భాస్కర్‌రెడ్డి, హెచ్ఎం స్వర్ణలత, వైద్యురాలు తేజస్వీ, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీధర్‌కుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి వెంకటప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ప్రమాణపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 94406 61900, 90109 65230 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'కులవివక్షపై విచారించి చర్యలు తీసుకుంటాం'

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రంలో కుల వివక్ష చూపించారని దానిపై విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తెలిపారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో సీడీపీవో లక్ష్మీప్రసన్నతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ చిన్నారులను కేంద్రంలోకి పిలుచుకోకుండా బయట కూర్చోబెట్టారని తమ దృష్టికి వచ్చిందన్నారు. సీడీపీవో అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించి, పిల్లలను కేంద్రంలోకి పంపించారని తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్త, ఆయాను విచారిస్తున్నామన్నారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ కుల వివక్షను ఉపేక్షించకూడదన్నారు. ఆ కేంద్రాన్ని మార్పు చేయడమా లేదా అనేది తరువాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు ప్రాజెక్టుల్లో ఉన్న సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని తెలిపారు.

ఛీ.. ఛీ.. కంపు



కళ్యాణదుర్గం పట్టణంలోని పూర్ణానంద స్వామి ఆశ్రమం వెనుక వైపు ఉన్న లేఔట్ నుంచి మురుగునీరు ప్రవహిస్తున్నాయి. పట్టణంలోని మురుగు ఆర్టీసీ ఆసుపత్రి పక్కన ఉన్న లేఔట్‌లోని కాలువలోకి వచ్చి.. అక్కడి నుంచి ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం, నివాస గృహాలు, షాదీ మహాల్ వద్ద నిలుస్తున్నాయి. దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. అందులో దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది రాత్రివేళ నిద్రపోలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మున్సిపల్ డీఈ సురేశ్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం**

ఆరుబయటే వంట

శెట్టూరు ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్వాహకులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడికెల వంటగది కారుతుంది. దాంతో నీరు అన్నం, పప్పు గిన్నెల్లో పడతాయనే భయంతో ఏజెన్సీవారు ఆరుబయట వండుతున్నారు. వంట గది పక్కనే ఉన్న కాలువ నీటితో నిండిపోయింది. సమస్యను పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ప్రయోజనం లేదని వారు వాపోయారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ గాయత్రి దృష్టికి తీసుకెళ్లగా వంటగది కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. **- న్యూస్‌టుడే, శెట్టూరు**





కూడేరులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేయాలి

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: పీఏబీఆర్ నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేసి, దాని పరిధిలోని చెరువులను నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. సాగు, తాగునీరు సాధన పేరుతో ఆ పార్టీ చేపట్టిన బస్సు యాత్ర శనివారం కూడేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ. కుడి కాలువ కింద ఆయా నియోజకవర్గాల్లో 42 చెరువులు ఉన్నాయన్నారు. వాటిని నింపితే భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల కింద పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. తాగునీటి పథకాల్లో పని చేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండు చేశారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

కణేకల్లు, న్యూస్‌టుడే: రాయితీ పప్పుసెనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు, నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని హనకనహాళ్, ఎన్.హనుమాపురం, సొల్లాపురం తదితర గ్రామాల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఏఓ శ్రావణ్‌కుమార్ పప్పుసెనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. మండలానికి 4,500 క్వింటాళ్లు కేటాయించగా 3,998.20 క్వింటాళ్లు సరఫరా అయినట్లు తెలిపారు. స్వరంచి జయరాం చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు నరేంద్ర, నాయకులు మరియప్ప, శరబనగౌడు, ఎస్కే మల్లికార్జున, నాగార్జున, వేణు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, తెదేపా నాయకులు

వైద్య విద్యార్థి మృతి కలచివేసింది

ఉరవకొండ, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థి నర్రా చైతన్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన తనను కలచి వేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం ఉరవకొండలో చైతన్య మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. విద్యార్థి తల్లిదండ్రులు కేశన్న, సుజాతను ఓదార్చారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా విద్యార్థి మృతదేహానికి నివాళి అర్పించి, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మధుసూదనరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఏపీ ఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మాజీ ఎంపీపీ ప్రతాప్‌నాయుడు, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, నాయకులు బోదపాటి గోవిందప్ప, సినిమా రామాంజనేయులు, బోస్, యర్రగుంట్ల వెంకటేశ్, నెట్టెం రాంబాబు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్‌లు రేగటి నాగరాజు, రమణయాదవ్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు తదితరులు నివాళి అర్పించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం, బెళుగుప్ప మండలాల్లో శనివారం జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. రాయదుర్గం మండలంలోని మల్లాపురం తండా వద్ద శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపుతప్పి శాంతి నగర్‌కు బొమ్మన్న(45) మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటోలో ట్యాంకరు ఏర్పాటు చేసుకొని శుద్ధజలం విక్రయించేవారు. కర్ణాటకలోని పెదారగుడ్డంకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వంతెనపై నుంచి పడి ఒకరు.. బెళుగుప్ప: కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనిపల్లి గ్రామానికి చెందిన గంగాధర్(32) భార్య సీమంతం ఉండటంతో బంధువులను పిలవడానికి అనంతపురం వెళ్లారు. తిరిగి వెళ్తుండగా బెళుగుప్ప మండలంలోని కాలువపల్లి గ్రామంలో పెన్నానదిపై వాహనం అదుపు తప్పి వంతెనను ఢీకొట్టి సుమారు 40 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడిపోయాడు. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు వివరాలు సేకరించారు.

పలు ఘటనలపై కేసుల నమోదు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలోని ఓ గ్రామంలో వెంకటేశులు అనే వ్యక్తి తనను అసభ్య పదజాలంతో దూషించి, దుస్తులు చించాడని బాధితురాలు శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

★ పట్టణంలోని విద్యానగర్‌లో మౌనిక అనే వివాహిత కడుపునొప్పి తాళలేక శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

★ కళ్యాణదుర్గం పట్టణంలోని పార్వతీనగర్‌లో నివాసం ఉంటున్న సూరియ కంబదూరు మండలం వెంకటంపల్లికి చెందిన మహేశ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెళ్లి చేసుకొనేందుకు సిద్ధం కాగా తన భర్త అన్న మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. తన నుంచి భర్తను వేరు చేసి రెండో పెళ్లి చేయాలని చూస్తున్నారని బాధితురాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 74ఉడేగోళం గ్రామంలో శనివారం వేకువజామున చింతమాను శ్రీనివాసులు అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయింది. భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటిలో నిద్రపోతుండగా పైకప్పు కూలింది. బయటకు పరుగులు తీయడంతో ఎలాంటి ప్రాణాపాయం సంభవించలేదు. ఆహార ధాన్యాలు, గ్యాస్ పొయ్యి, టీవీ, దుస్తులు పాడైపోయినట్లు బాధితులు తెలిపారు. ఈమేరకు తమను ఆదుకోవాలని రాయదుర్గం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు.

జూదరుల అరెస్టు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: ఎల్‌బీనగర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో జూద స్థావరంపై శనివారం పోలీసులు దాడులు చేశారు. 15 మందిని అదుపులోకి తీసుకుని రూ.82,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రాయదుర్గం గ్రామీణ సీఐ వెంకటరమణ, ఎస్సై నబీరసూల్ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఆర్టీసీ బస్టాండు

కణేకల్లు, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ బస్టాండు రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. పరిసర ప్రాంతంలో మద్యం సీసాలు, కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు పడి ఉండటం గమనార్హం. రాత్రి 8గంటలకు బస్టాండు నుంచి చివరి బస్సు సర్వీసు రాయదుర్గానికి బయలుదేరగానే ప్రయాణికులు ఎవరూ ఉండరు. ఈ సమయంలో ఆకతాయిలు బస్టాండులో లైట్లు ఆర్పివేసి మద్యం తాగడం, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు గస్తీ నిర్వహించి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.కోట్లలో పన్ను బకాయిలు



రాయదుర్గం పురపాలక సంఘం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం పురపాలక సంఘంలో వివిధ రకాల పన్నులు రూ.10 కోట్ల దాకా పేరుకుపోయాయి. అందులో పాత బకాయిలు దాదాపు రూ.4కోట్ల దాకా ఉన్నాయి. ఏటా పురపాలక సంఘానికి రూ.5కోట్ల దాకా ఆదాయం వస్తుండగా రూ.6కోట్ల మేర వ్యయం ఉంటుంది. రూ.కోటి దాకా అదనంగా ఖర్చులు వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా పన్నులు సక్రమంగా వసూలు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులపై ఆధారపడి అభివృద్ధి పనులు చేయాల్సిన పరిస్థితి. గతంలో పురపాలక సంఘానికి ఏటా రూ.కోటికిపైగా వచ్చే స్టాంపు డ్యూటీ ఆదాయాన్ని వైకాపా ప్రభుత్వం మంజూరు చేయక మొండిచేయి చూపింది. హెచ్చెల్సీ తాగునీటి నిర్వహణకు సంబంధించిన హెచ్‌టీ విద్యుత్తు బిల్లులు రూ.30కోట్ల దాకా పేరుకుపోయాయి. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20కోట్లు హెచ్‌టీ విద్యుత్తు బిల్లులకు చెల్లించారు. దాంతో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

పన్నులు	మొత్తం	వసూలైనవి	బకాయిలు
ఆస్తి	5,08,83,228	1,54,01,361	3,54,81,867
ఖాళీస్థలాలు	2,52,04,704	10,26,176	2,41,78,528
నీటిపన్ను	4,18,85,849	29,53,668	3,89,32,181

ప్రతి నెలా రూ.50 లక్షల దాకా వ్యయం: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, డీజిల్, మున్సిపల్ కార్యాలయం, పట్టణంలోని వీధి దీపాలకు సంబంధించిన విద్యుత్తు బిల్లులు తదితరాలకు ప్రతి నెలా రూ.50లక్షల దాకా పురపాలక సంఘం వెచ్చించాల్సి వస్తోంది. సాధారణ నిధులతో అత్యవసర చిన్న పనులు కూడా చేయలేని పరిస్థితి నెలకొంది.

వసూళ్లకు ప్రత్యేక బృందాలు

ప్రజలు సహకరించాలి

- వి.దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

పన్నుల వసూళ్లకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశాం. వారికి రోజువారీ లక్ష్యాలను నిర్దేశించాం. ప్రజలు పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలి.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి



కోటంకలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాకు తాగు, సాగు నీరందించే ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. బస్సు యాత్ర శనివారం మండలంలోని మర్తాడు, కోటంక గ్రామాల్లో సాగింది. తుంగభద్ర ఎగువ కాలువ గట్లు, హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు, చివరి ఆయకట్టుకు నీరందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, బాలరంగయ్య, కృష్ణమూర్తి, పండ్లతోటల రైతు సంఘం జిల్లాధ్యక్షుడు, శివారెడ్డి, మండల కార్యదర్శి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరణాలయానికి విరాళం అందజేత

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పట్టణంలోని ఆరోగ్యమాత చర్చి ఆవరణంలో నిర్వహిస్తున్న మదర్ థెరిసా శరణాలయానికి చర్చి ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం రూ.50 వేలు విరాళం అందజేశారు. ఆశ్రయం పొందుతున్న వారి కోసం వినియోగించాలని కోరారు.

వర్షాలకు కూలిన ఇళ్లు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి ఆర్.ఎస్.లోని రోఫ్రూఫ్ మకానం వద్ద ఉన్న అల్లాబకాశ్, సాదిక్‌వలి ఇళ్లు శనివారం వర్షానికి కూలిపోయాయి. మూడ్రోజులుగా కురిసిన వర్షాలకు పాత ఇళ్లు తడిసి పైకప్పులు కూలాయి. ఆ సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తమకు ఆర్థిక సాయం అందజేయాలని తహసీల్దారును కోరారు.

‘ఆక్రమణల తొలగింపులో వివక్ష చూపొద్దు’

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిఆర్.ఎస్.లోని కర్నూలు రోడ్డులో కాలువలపై ఉన్న ఆక్రమణల తొలగింపులో వివక్షతను చూపరాదని ప్రజలు శనివారం పురపాలక కమిషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. మార్కింగ్ వేయకుండా ఆక్రమణల తొలగింపులో భాగంగా తమ ఇళ్లను కూల్చడం అన్యాయమన్నారు. రోడ్డుకు రెండు వైపులా ఉన్న ఆక్రమణలను ఎలాంటి వివక్షత లేకుండా తొలగించాలని కోరారు.

కొనుగోలుదారులకు రశీదు ఇలివ్వాలని వినతి

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణంలోని పలువురు వ్యాపారులు కొనుగోలు దారులకు రశీదులు ఇవ్వకుండా ప్రభుత్వానికి జీఎస్టీని ఎగ్గొడుతున్నారని దళిత సంఘాల నాయకులు అన్నారు. స్థానిక వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయానికి వెళ్లి అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దళిత సంఘాల నాయకులు మహేంద్ర, చంద్రశేఖర్, భీమలింగ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవపై అవగాహన

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి ప్రభుత్వాస్పత్రిలో శనివారం రోగులకు ఆయుష్మాన్‌భవ పథకంపై వైద్యులు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి ఎల్లప్ప కోరారు. వైద్యుడు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంబరాలు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని సీఎస్ఐ చర్చిలో శనివారం క్రైస్తవులు సంబరాలు చేసుకున్నారు. చర్చిని నిర్మించి వందేళ్లు కావడంతో కేకు కోసి పంచిపెట్టారు.

ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో ఈనెల 24, 25వ తేదీల్లో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 26వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో సామాజిక మాధ్యమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోశ్‌కుమార్, సహాయ కార్యదర్శి వంశీకృష్ణలు మాట్లాడుతూ.. యువత వ్యసనాలు, బెట్టింగ్‌లు ఆడుతూ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ఆరోపించారు.

విస్తరణ పనులు కాగితలకే పరిమితం

■ ఆయకట్టు రైతులకు అన్యాయం

గుంతకల్లు, గుత్తి, గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎగువ కాలువలో భాగమైన గుత్తి సబ్‌బ్రాంచ్ కాలువకు కేటాయించిన నీరు పూర్తిస్థాయిలో సరఫరా అయ్యేలా ట్రఫ్ (సిమెంటు నిర్మాణం)ను విస్తరింపజేయడంలో పాలకులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. హెచ్చెల్సీకి చెందిన నీరు గుంతకల్లు బ్రాంచ్ కాలువకు విడుదల చేసిన తరువాత గుత్తి ఉప కాలువకు వెళ్తుంది. ఉపకాలువలో నీరు వెళ్లడానికి గుంతకల్లుకొట్టాల సమీపంలో గుంతకల్లు - బళ్లారి రైల్వేలైన్‌లోని వంతెన కింద ప్రభుత్వం అప్పట్లో 110 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ట్రఫ్‌ను నిర్మించింది. ఆ తరువాత 1990లో కాలువకు 201.29 క్యూసెక్కులను కేటాయించింది. గత 34 ఏళ్లుగా ట్రఫ్ విస్తరణపై పట్టించుకోవడం లేదు. గుత్తి ఉపకాలువ కింద గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాలకు చెందిన ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతోంది.



రైల్వే వంతెన కింద నిర్మించిన గుత్తి ఉపకాలువకు చెందిన ట్రఫ్

★ గుత్తి ఉపకాలువ కింద 16,271 ఎకరాల ఆయకట్టుకు హెచ్చెల్సీ నీటిని అందజేయాల్సి ఉంది. గత పదేళ్లుగా తుంగభద్ర నీరు గుత్తి ఉపకాలువకు సరఫరా కావడం లేదు. నీటిని అందించడానికి పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

★ హంద్రీనీవా కాలువ నుంచి గుత్తి కాలువకు అనధికారికంగా కొంత నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీరు 4 వేల ఎకరాలకు మించి సరిపోవడంలేదు. ఇంకా 12,271 ఎకరాలకు నీరందక రైతులు రూ.58 కోట్లు విలువచేసే పంటలను కోల్పోతున్నారు.

★ ట్రఫ్‌ను విస్తరింపజేసి గుత్తి ఉపకాలువకు 201.29 క్యూసెక్కుల నీటినందిస్తే రైతులు పంటలు సాగు చేసుకుంటారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తమను ఆదుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నిధుల మంజూరుకు కృషి

- వెంకటరమణ, ఈఈ, గుంతకల్లు డివిజన్

గుత్తి ఉపకాలువను ఆధునీకీకరించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి రూ.130 కోట్లను కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించాం. నిధులు విడుదల అయితే ఆధునికీకరణ పనుల్లో భాగంగా ట్రఫ్‌ను కూడా విస్తరింపజేయాలని నిర్ణయం తీసుకున్నాం. ట్రఫ్ విస్తరణతోనే ఆయకట్టుకు పూర్తిగా నీరందుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులోని ఆలూరు రోడ్డు ప్రశాంతి నగర్‌లో ఆరు రోజులకోసారి తాగునీరు వస్తున్నాయి.
- నాదన్‌వలి

సమాధానం: మోటారు మరమ్మతు వల్ల ఆలస్యమైంది. కుళాయిలకు నీరు వదులుతున్నాం
- హరికృష్ణ, ఏఈ

సమస్య: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీ పరిధిలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో భారీ గొయ్యి పడటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.
- నారాయణస్వామి

సమాధానం: గొయ్యిని పూడ్చి ఇబ్బందులు లేకుండా చూస్తాం.
- సదాశివం, ఈవోఆర్డీ

సమస్య: పెద్దవడుగూరులోని లక్షుంపల్లికి వెళ్లే రహదారిలో పైపులైను కోసం తవ్విన రోడ్డు ప్రస్తుతం పెద్దగుంతగా మారి ఇబ్బందిగా ఉంది.
- లింగమయ్య, పెద్దవడుగూరు

సమాధానం: మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం
- ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి

సమస్య: ఆస్పత్రికి వెనుక ఉన్న ఆదర్శ పాఠశాల కాలనీలో తాగునీటి పైపులైను లీకేజీతో నీరు వృథా అవుతున్నాయి. - బాబయ్య

సమాధానం: పరిశీలించి లీకేజీని అరికట్టేలా చర్యలు తీసుకుంటాం
- ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు

– న్యూస్‌టుడే,గుంతకల్లు పట్టణం, బుక్కరాయసముద్రం, పెద్దవడుగూరు

చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

నార్పల, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టాన్ని ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బ్రహ్మసముద్రం మండలంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు కుల వివక్షతకు గురైన విషయంపై నార్పలలో సమావేశమై మాట్లాడారు. ఆధునిక కాలంలో కూడా చిన్నారులపై వివక్షత చూపిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు చిన్నఆంజనేయులు, హనుమంతు, గంగన్న, రమణ, నారాయణ, ఎర్రినాగప్ప పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్వహణపై అసంతృప్తి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వాహణ అస్తవ్యస్తంగా ఉందని గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథాచారి అసంతృప్తి వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం బాలుర, బాలికల వసతి గృహాలను తనిఖీ చేసి మౌలిక వసతులపై ఆరా తీశారు. గదుల్లో పైకప్పు పెచ్చులూడి విద్యార్థులకు ప్రమాదకరంగా ఉంటున్నా చర్యలు తీసుకోవడం లేదని వార్డెన్లను ప్రశ్నించారు. భోజనం, వసతి, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఆయన వెంట న్యాయవాదులు గంగాధర్, కుమార్, టైపిస్టు సాదిక్‌వలి తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరు: తనిఖీ చేస్తున్న జడ్జి కాశీవిశ్వనాథాచారి

పామిడి: పామిడిలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గుత్తి మండల న్యాయసేవా సమితి ఛైర్మన్ సాదుబాబు ఆదేశాల మేరకు శనివారం సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథాచారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట, వసతి, స్నానపు గదులను పరిశీలించారు. హాస్టల్ వార్డెన్ ఆదినారాయణతో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దస్త్రాలు పరిశీలించారు. ఆయన వెంట ప్యానల్ అడ్వకేట్ వీసీ గంగాధర్ తదితరులు ఉన్నారు.

గుంతకల్లు పట్టణం: హనుమేశ్ నగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలికల వసతి గృహాలను జడ్జి మంజుల ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో బాలికలు లేకపోవడంతో ఎక్కడికి వెళ్లారని అడుగగా, ఊర్లకు వెళ్లారని వార్డెన్లు చెప్పడంతో ఎలా పంపుతారని అసంతృప్తి వ్యక్తం చేశారు. వంట గదులు, మరుగుదొడ్లను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దస్త్రాలు, మెను పరిశీలించారు. న్యాయవాదులు షాదుద్దీన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణకు చర్యలు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న తిలక్‌నగర్ వాసులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు పురపాలకంలో ఇంటింటా చెత్తసేకరణ కార్యక్రమాన్ని పటిష్టపరుస్తామని కమిషనర్ నయూం అహమ్మద్ తెలిపారు. శనివారం వివిధ కాలనీల్లో పర్యటించి పారిశుద్ధ్యం పనుల అమలుపై అభిప్రాయాలు సేకరించారు. తిలక్‌నగర్‌లో ఇళ్లనుంచి చెత్తను తీసుకెళ్లడానికి సిబ్బంది రావడం లేదని, కాలువలు సక్రమంగా శుభ్రం చేయడం లేదని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సిబ్బంది సమర్థవంతంగా పనులు చేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్మికులు చేస్తున్న పనులను తెలుసుకునేందుకు ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని వివరించారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లు, న్యూస్‌టుడే: నిరుద్యోగులు వివిధ ట్రేడ్‌లో శిక్షణ పొంది స్వయం ఉపాధి కోసం వినియోగించుకోవడానికి ప్రభుత్వం న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టణ తెదేపా మాజీ అధ్యక్షుడు అంజి, న్యాక్ సంస్థ శిక్షకుడు ఇన్‌ఛార్జి సుధాకర్ పేర్కొన్నారు. శనివారం భాగ్యనగర్‌లోని సచివాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడ వైరింగ్ చేయడం, సర్వేయర్లు, భవనాల నిర్మాణం, ప్లంబింగ్ తదితర అంశాలపై ఈనెల 26 నుంచి గుత్తిరోడ్డు పక్కన జీబీసీ కార్యాలయ ఆవరణంలో రెండు నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత ధృవీకరణ పత్రం అందజేస్తామన్నారు. శిక్షకుడు శ్రీనివాసులు, సచివాలయ కార్యదర్శులు నివేదిత, సుధాకర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ దారులు బురదమయం



గుంతకల్లులోని ప్రశాంతినగర్‌లో సీసీ రోడ్లు లేక బురదతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా మట్టిరోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, వాహనాలు ఇరుక్కుపోతున్నాయని కాలనీవాసులు, వాహన చోదకులు వాపోతున్నారు. అభివృద్ధి పనులకు భూమి పూజలు జరిగాయని, అధికారులతో చర్చించి నిర్మాణాలు ప్రారంభిస్తామని కౌన్సిలర్ సుధాకర్ తెలిపారు.

- న్యూస్‌టుడే, గుంతకల్లు

గుంతతో జర భద్రం



తాడిపత్రి పట్టణంలోని యల్లనూరు రోడ్డు కూడలిలో రహదారిపై ఉన్న గుంత ప్రమాదకరంగా ఉంది. గత ప్రభుత్వంలో కూడలిలో భూగర్భ మురుగు కాలువ పనులు చేపట్టారు. ఆ సమయంలో కాలువకు ఇనుప గేటు ఏర్పాటు చేశారు. అయితే కాలువపై సరైన మూతలేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ తేజను వివరణ కోరగా.. మూత ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి

విద్యార్థులకు వృత్తి విద్య అవసరం



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బుక్కరాయసముద్రం : విద్యార్థులకు చదువుతో పాటు వృత్తివిద్య కూడా అవసరమని వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బిల్‌కిష్‌బేగం తెలిపారు. శనివారం ఆర్ట్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో రంగోత్సవ్-2024 పోటీలు నిర్వహించి, ప్రతిభ కనపరిచిన 46 మంది విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

బాలబాలికలు సమానమే..

బుక్కరాయసముద్రం : తల్లిదండ్రులు బాలబాలికలను సమానంగా చూడాలని కొర్రపాడు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. శనివారం కొర్రపాడులో లింగ వివక్షతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలు చదువుకోవడానికి ప్రభుత్వం గురుకుల పాఠశాలలు, కస్తూరిబా విద్యాలయాలు, వసతిగృహాలు, ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసి ఉచితంగా విద్య, వసతి అందిస్తోందన్నారు. బాల్యవివాహాలు చేయకూడదని సూచించారు. డాక్టర్ వినోద్‌కుమార్, వైద్య సిబ్బంది పర్వీన్, శ్రీదేవి, కేశవయ్య పాల్గొన్నారు.

రీసర్వేలో పొరపాట్లపై దరఖాస్తుల స్వీకరణ

పామిడి, న్యూస్‌టుడే: రీసర్వే గ్రామ సభల్లో భాగంగా మండలంలోని అప్పాజీపేట, దేవరపల్లి గ్రామాల్లో శనివారం తహసీల్దారు శ్రీధర్‌మూర్తి అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సభలను నిర్వహించారు. రైతులకు రీసర్వేలో జరిగిన పొరపాట్లతో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. రీసర్వే ఉప తహసీల్దారు విజయ్, మండల సర్వేయర్ మురళీధర్, తెదేపా మండల కన్వీనర్ ముసలిరెడ్డి పాల్గొన్నారు.

గార్లదిన్నె గ్రామీణం: మండలంలోని కల్లూరు అగ్రహారం, కొప్పలకొండ గ్రామాల్లో శనివారం గ్రామసభను నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకాల బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దారు దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



పామిడి: గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, అధికారులు, రైతులు

పెద్దవడుగూరు: మండలంలోని నాగలాపురం, కొండూరు గ్రామాల్లో శనివారం రైతుల నుంచి 21 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు ఉషారాణి తెలిపారు.

దుకాణ సముదాయ నిర్మాణానికి కసరత్తు



దుకాణాల నిర్మాణాలు చేపట్టే స్థలం

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పురపాలిక ఆదాయాన్ని పెంచేందుకు పాలకులు, అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పాత పురపాలిక కార్యాలయ స్థానంలో దుకాణ సముదాయాన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే గుత్తి, గుత్తి ఆర్.ఎస్.లలో 78 దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ.38 లక్షలు ఆదాయం వస్తోంది. ప్రైవేటు దుకాణ సముదాయాల కంటే పురపాలిక మార్కెట్‌స్టాళ్లు తక్కువ అద్దెకు లభిస్తున్నాయి. అనంతపురం, కర్నూలు రోడ్లలో దుకాణాల కోసం వ్యాపారులు ఎగబడుతున్నారు. రెండేళ్ల కిందటే 83 దుకాణాలను గుడ్‌విల్‌తో నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పుడు ఆ దస్త్రానికి కదలిక వచ్చింది. వివాహ, శుభ కార్యాలకు ఫంక్షన్‌హాల్‌ను కూడా నిర్మించేందుకు నిర్ణయించారు. వేలం ప్రక్రియ త్వరలోనే పూర్తి చేస్తామని కమిషనర్ జబ్బార్‌మియ తెలిపారు. దుకాణ సముదాయ నిర్మాణ ప్రక్రియ తుదిదశకు చేరడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని కండ్లగూడూరుకు చెందిన సూర్యనారాయణరెడ్డి అనే రైతు శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. గ్రామ సమీపంలోని తన పొలంలో అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స కోసం పామిడి ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

పురుగు మందు తాగి వివాహిత ..

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని ఇల్లూరుకు చెందిన సరస్వతి అనే వివాహిత శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

కార్మికుడికి గాయాలు

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనంలో సెంట్రింగ్ పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు మౌలా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. తలకు, కాళ్లకు గాయాలవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

టపాసుల విక్రయాల్లో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: దీపావళి పండగ సందర్భంగా విక్రయించే బాణాసంచా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. డివిజన్ పరిధిలోని విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. లైసెన్సులు ఉన్నవారు మాత్రమే విక్రయించాలన్నారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎదుర్కోవడానికి అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని, కేటాయించిన ప్రదేశాల్లో కాకుండా వేరేచోట విక్రయాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెచ్చెల్సీ కాలువపై వంతెనలు నిర్మించాలి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని హెచ్చెల్సీ కాలువపై కూలిన వంతెనలను మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లప్ప డిమాండు చేశారు. శనివారం బుక్కరాయసముద్రంలో విలేకరులతో మాట్లాడారు. కెకె.అగ్రహారం, సంజీవపురం, దయ్యాలకుంటపల్లి గ్రామాల దగ్గర రెండు హెచ్చెల్సీ వంతెనలు శిథిలమై కూలిపోయాయన్నారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని వంతెనలు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో సీపీఎం పార్టీ తరపున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు కుళ్లాయప్ప, శ్రీనివాసులు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణంలోని విజయనగర్ కాలనీకి చెందిన షేక్షావలి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు శనివారం నిత్యావసర సరకులు అందజేశారు. కుటుంబ పెద్ద కిడ్నీ వ్యాధితో మంచాన పడటంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతోందని తెలుసుకుని సరకులు అందజేసినట్లు తెలిపారు. సభ్యులు ప్రశాంతి, లలిత, రషీదా తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత

గుంతకల్లు, న్యూస్‌టుడే: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడిని శనివారం పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్లు గుంతకల్లు ఆర్పీఎఫ్ సీఐ వసంతరావు తెలిపారు. హైదరాబాదుకు చెందిన నర్సింగ్ కుమారుడు మనీశ్ (14) ఇంటి నుంచి పారిపోయి రైలులో వెళ్లినట్లు తలిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి ఫోటో ఆధారంగా గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో గుర్తించారు. విషయాన్ని హైదరాబాదు పోలీసుల ద్వారా బాలుడి తల్లిదండ్రులు తెలియజేసి, సురక్షితంగా అప్పగించినట్లు వివరించారు.

జూదరుల అరెస్టు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలోని శర్మాస్‌కాలనీలో శనివారం పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అరెస్టు చేశారు. సీఐ కరుణాకర్ సిబ్బందితో కలిసి ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.98 వేల నగదు, 7 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

యాడికి: మండలంలోని లక్షుంపల్లికి చెందిన శివానందరెడ్డి, నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన సుధాకర్‌రెడ్డి కలిసి చందనలో, యాడికి పట్టణం కోనరోడ్డులోని చౌడేశ్వరీ ఆలయ సమీపంలో మేకల రామకృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.60వేలు నగదుతో పాటు చిట్టీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గార్లదిన్నె: మండలంలోని కల్లూరుకు చెందిన హాజీవలిని శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలో మట్కాచీటీలు రాస్తుండగా దాడులు చేసి అతని వద్ద ఉన్న చీటీలతో పాటు రూ.10వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆగిన కాలువ నిర్మాణ పనులు

● ముందుకు కదలని మురుగు

తాడిపత్రి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో మురుగుకాలువ పనులు అర్ధంతరంగా ఆగాయి. తాడిపత్రి పట్టణంలోని లలితా మెగామాల్ వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు మున్సిపల్ సాధారణ నిధులలో సుమారు రూ.40 లక్షలతో కాలువ పనులు చేపట్టారు. రెండేళ్ల కిందట ఈ పనులు ప్రారంభం కాగా, అప్పట్లోనే బిల్లులు కాలేదని సదరు గుత్తేదారుడు సగంలో పనులు ఆపేసి వెళ్లిపోయారు. ఆ పనులు కూడా నాసిరకంగా చేయడంతో కల్వర్టు కుంగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు జగరకపోవడంతో మురుగు ముందుకు సాగలేదు. వెరసి ఆయా కాలనీవాసులు అష్టకష్టాలు పడుతున్నారు.

ముంపునకు గురవుతున్న కాలనీలు..

తాడిపత్రి పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో పలు కాలనీలు సీబీ రోడ్డు లోతట్టుగా ఉన్నాయి. వర్షం వచ్చిందంటే పెద్దఎత్తున నీరు చేరి ముంపునకు గురవుతుంది. గత ప్రభుత్వం సుమారుగా 500 మీటర్ల మురుగు కాలువ నిర్మించాలని నిధులు మంజూరు చేసింది. కానీ పనులు సగం కూడా చేయకుండా మధ్యలో వదిలేయడంతో సమస్య మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. కాలువలోకి వర్షపు నీరు పోకుండా వీధుల్లోకి చేరుతోంది. మురుగునీరు కాలువల్లో నుంచి వీధుల్లోకి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువను నిర్మించాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ధ్వంసమైన కల్వర్టు

గుత్తేదారుకు నోటీసులు

- తేజ, మున్సిపల్ ఏఈ, తాడిపత్రి

పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ నుంచి బస్టాండు వరకు మురుగు కాలువ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే అప్పట్లో గుత్తేదారులు పనులను మధ్యలోనే నిలిపి వెళ్లిపోయారు. ఇదివరకే అతనికి నోటీసులు అందజేశాం. సదరు గుత్తేదారులు పనులు చేయకుంటే టెండర్ రద్దు చేసి, మళ్లీ టెండర్ వేసి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

ఘరానా మోసగాడి అరెస్టు

కడప, నేరవార్తలు : మహిళలను నమ్మించి పెళ్లి చేసుకుని మోసం చేస్తున్న ఘరానా మోసగాడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడు కేవలం పెళ్లి చేసుకోవడమే కాదు, ఉద్యోగాలిప్పిస్తానంటూ పలువురిని మోసం చేశాడు. పోలీసుల వివరాల మేరకు... కడపకు చెందిన చిన్నబోయిన రాము, కడప తాలూకా పరిధిలోని ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.కొద్ది రోజులకే యువతిని మోసం చేశాడు. యువతి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గతంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురిని మోసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడిపై కడప, తాడిపత్రి, ప్రొద్దుటూరులో కేసులు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

చిక్కవడియార్ చెరువులో అక్రమ నిర్మాణాలు



చెరువు స్థలంలో చేపట్టిన నిర్మాణం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం చిక్కవడియార్ చెరువులో అక్రమ నిర్మాణాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈ చెరువు అనంతపురం పట్టణానికి దగ్గరగా ఉండటంతో అనంతసాగరం కాలనీ, విజయనగర్ కాలనీ శివార్లలో చెరువు స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం చెరువులోకి నీరు వస్తుండటంతో అక్రమ నిర్మాణాలు నీటిలో ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. దీనికితోడు కలెక్టరేట్ ఎదురుగా చెరువుకట్టకు ఇరువైపులా పలువురు దుకాణాలు ఏర్పాటు చేసుకుని చెరువులోకి వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో నీరు కలుషితమై చెరువులో చేపలకు హాని కలిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలు తొలగించి చెరువు స్థలాన్ని రక్షించాలని ప్రజలు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ సురేశ్‌ను వివరణ కోరగా చెరువులో ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

అనంతపురం
• అనంతపురం • రాప్తాడు

'కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం'

ఎస్కేయూ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా బాధ్యుడు వెంకట నరసింహులు పిలుపు ఇచ్చారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో శనివారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా వెంకట నరసింహులు హాజరయ్యారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రిని చేయడానికి ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా పని చేయాలన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కోటా సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి కృషి చేస్తున్నామన్నారు.

వేగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: వర్షం వచ్చి ఆగినా నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని వేగంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మేయర్ వసీం నగరపాలక అధికారులకు తెలియజేశారు. శనివారం ఉదయం నగరంలోని వడ్డేవారి కాలనీ, యువజన కాలనీ, జనశక్తినగర్, నడిమి వంక పరిసర ప్రాంతాలు, రజకనగర్, భవానినగర్, వినాయకనగర్ తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పలు ప్రాంతాల్లో మురుగు, బురద నిలబడి ఉండటంతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వెంటనే డ్రోజర్లతో బురదను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దోమలు పెరిగి జ్వరాలు తీవ్రం అయ్యే పరిస్థితి రాకూడదని అధికారులకు నిర్దేశించారు.

23న వినికిడి సమస్య ఉన్నవారికి వైద్య శిబిరం

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా దీనదయాల్ శిక్షణ ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ చెవుడు నిర్మూలన నియంత్రణ కార్యక్రమం (ఎన్‌పీపీసీడీ) సంయుక్తంగా ఈ నెల 23న వినికిడి సమస్యతో బాధపడుతున్న 1 నుంచి 19 సంవత్సరాల వయసు వారి కోసం అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న త్వరిత చికిత్స కేంద్రం ఓపీ నంబరు 99లో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ.బి.దేవి, ఎన్‌పీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. గతంలో ఈఎన్‌టీ వైద్యులతో చూపించుకున్న రిపోర్టులను వినికిడి బాధితులు తమ వెంట తెచ్చుకోవాలని తెలియజేశారు.

క్రీడలతో అనంత కీర్తిని ఇనుమడించాలి

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: క్రీడలతో అనంత కీర్తిని ఇనుమడించాలని మేయర్ వసీం ఆకాంక్షించారు. ఇటీవల కర్నూలులో జరిగిన చెస్ టోర్నమెంటులో ఉత్తమ ప్రతిభ చూపిన మహేశ్వరరెడ్డి, ప్రణతిలను శనివారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. రాపిడ్ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంటులో మహేశ్వరరెడ్డి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో, ప్రణతి నాలుగో స్థానంలో నిలిచారన్నారు.

పత్తి చలపతికి మంత్రి నివాళి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జనసేన నాయకుడు పత్తి చలపతికి రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పలువురు జనసేన నాయకులు శనివారం నివాళి అర్పించారు. నగరంలోని జరిగిన ఓ కార్యక్రమంలో చలపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మైనార్టీ కాలనీలో పల్లెపండుగ

రాప్తాడు, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నాయకులు, అధికారులు పేర్కొన్నారు. రాప్తాడు మండలం మైనార్టీ కాలనీ, ప్రసన్నాయపల్లి పంచాయతీల్లో అభివృద్ధి పనులు వర్క్స్, సీసీ రోడ్లు ప్రారంభించారు. తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీవో విజయలక్ష్మి ఏపీవో సావిత్రి, కన్వీనర్ కొండప్ప, సర్పంచి తిరుపాల్, రామకృష్ణ, బుల్లే సత్తి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బాలాజీ కాలనీలో పేరుకున్న బురద



గాంధీ బజార్ పాతూరు జూనియర్ కళాశాల ఎదురుగా..

బురద బాధలు ఇన్నిన్ని కాదయా!

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: నగరంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చాలా ప్రాంతాల్లో మురుగు బురద మిగిలింది. దుర్వాసన వెదజల్లే మురుగు మట్టితో ప్రజలు ఇంట్లో ఉండటానికి ఇబ్బంది పడ్డారు. నాలుగు రోజులుగా తుపాను ప్రభావం తగ్గిందనుకుంటుండగా మళ్లీ భారీ వర్షం కురిసింది. భారీగా మురుగు నీరు నివాసాల ముందు, పల్లపు ప్రాంతాల్లోకి రావడంతో అడుగులోతు నిలిచింది. నగరంలోని గాంధీ బజార్, ఎన్టీఆర్ఆర్ మార్గ్, వినాయకనగర్, బాలాజీ కాలనీ, రజకనగర్, జనశక్తినగర్, యువజన కాలనీ, రాంనగర్ తదితర ప్రాంతాల్లో వీధుల్లోనే కాకుండా ప్రధాన రోడ్లలో మురుగు బురద నల్లగా పేరుకుంది. శనివారం నగరపాలక కొన్ని ప్రాంతాల్లో డ్రోజర్లు ద్వారా తొలగించినా పూర్తిగా తొలగలేదు. ట్యాంకులతో శుభ్రం చేసి ఉంటే ప్రయోజనం ఉండేది.



జనశక్తి నగర్‌లో రోడ్డంతా బురదమయం

ఫిర్యాదు.. పర్యావసానం

● అమ్మవారి చెరువు వంకకు అడ్డంగా ఓ కీలక వైకాపా నాయకుడు గోడ కట్టడంపై ఈనాడులో ప్రచురించిన కథనం ఆధారంగా 29వ డివిజన్ కార్పొరేటర్ ఈనెల 7న కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 15న అడ్డంగా కట్టిన గోడను తొలగించి సాయినగర్ 5, 6 క్రాసుల్లో ముంపు ముప్పు తప్పించారు.

అత్యధిక వర్షపాతం..

నగర ప్రజలు బిక్కుబిక్కు

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: జిల్లాలోనే అత్యధికంగా అనంత నగరంలో 64.2 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. అందరిలో ఒకటే భయం ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ఇక్కడి వరద తోడై వంకలు పొంగుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. అసలే మురుగువ్యవస్థ అంతంత మాత్రం. రాత్రివేళ కురిసిన భారీ వర్షానికి ముంపు ప్రాంత ప్రజలు కంటిమీద కునుకు లేకుండా గడిపారు. వైకాపా హయాంలో 2022 అక్టోబరులో నగరంలోని నడిమి వంక పరివాహ ప్రాంతాల్లో ఉన్న పలు కాలనీలు జలమయం కావడం వారి కళ్లలో మెదులుతూనే ఉంది. అప్పట్లో మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడం, కాలువకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించకుండా నిర్లక్ష్యంగా ఉండటంతో నీరంతా ఇళ్లలోకి చేరి ప్రజలు చిగురుటాకుల్లా వణికారు. గత 10 రోజులుగా అనంతపురం నగరంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరు వినోద్‌కుమార్ నగరంలోని పలు ప్రాంతాలను పర్యటించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలో ఉర్దూకు పూర్వవైభవం

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: గత పాలకులు ఉర్దూ భాషను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ వెలుగులు నింపారని రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు షకీల్ షఫీ అన్నారు. రాష్ట్రంలోని 185 మదర్సాల్లో విద్యా వాలంటీర్ల నియామకం, టీచర్ల నియామకానికి రూ.10 కోట్లు కేటాయించడంపై నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న మసీదు ప్రాంగణంలోని మదరసాలో సంబరాలు జరుపుకొన్నారు.

● ఐదేళ్ల వైకాపా హయాంలో ముస్లింలను ఓటు బ్యాంకుగా జగన్ రెడ్డి వాడుకుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 120 రోజుల్లోనే ముస్లింకు పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని మైనార్టీ నాయకులు సైపుద్దీన్ పేర్కొన్నారు. శనివారం చంద్రబాబు, లోకేశ్ చిత్రాలు ఉన్న ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

అమ్మపేరుతో ఒక మొక్క నాటండి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ అమ్మపేరుతో ఒక మొక్కనాటాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఆయన మొక్క నాటారు. ఆ మొక్కకు ప్రధానమంత్రి తల్లి హరీబెన్‌మోదీ అని నామకరణం చేశారు. నేటి మొక్కలు రేపటి వృక్షంగా మారతాయన్నారు. అమ్మపేరుతో ఒక చెట్టు కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉద్యమంలా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో దళితమోర్చా నేతలు లాల్‌సింగ్‌ఆర్య, దేవానంద్, ప్రిన్సిపల్ సత్యలత, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీరంగయ్య, అధ్యాపకులు ఫాతిమాబేగ, కేవీవీ శర్మ, రామకృష్ణ , రామాంజనేయులు పాల్గొన్నారు.



కేఎస్ఎన్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్, తదితరులు





అనుబంధ పుస్తకాలతో అదనపు నైపుణ్యం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు ఏర్పడతాయని, పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా అదనపు పుస్తకాలను కూడా చదవాలని సంగమేష్ నగర్ మాంటిస్సోరి పాఠశాల కార్యదర్శి మాధవి పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం ఆ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాలం వినియోగం, లాభాలు- నష్టాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పదోతరగతి విద్యార్థి తన్వష్ చరణ్ ప్రథమ, 8వ తరగతి విద్యార్థినులు తన్విక ద్వితీయ, హలీమసాదియా తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు మాధవి, ప్రిన్సిపల్ పద్మావతి బహుమతులు అందజేశారు.

సద్వాణి, త్రిభాషావాణి పుస్తకాల ఆవిష్కరణ

ఎస్కేయూ: ధార్మిక, నైతిక విలువలు కలిగిన పుస్తకాలు 'సద్వాణి', 'త్రిభాషావాణి' అని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథశర్మ పేర్కొన్నారు. ధార్మిక సంస్థల వ్యాఖ్యాత నాగత్రిశూలపాణి వర్ధంతి సందర్భంగా ఆయన సంస్మరణార్థం రూపొందించిన సద్వాణి, త్రిభాషావాణి పుస్తకాలను ఆవిష్కరించారు. శనివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగత్రిశూలపాణి మరణానంతరం ఆయన కుమార్తెలు ఈ పుస్తకాలను ముద్రణ రూపంలోకి తీసుకొచ్చారన్నారు. కొవ్వూరు ఓరియంటల్ కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌శర్మ, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కార్యదర్శి నిర్మలమ్మ, ప్రపుల్ల, కాశీవిశ్వనాథశర్మ పాల్గొన్నారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న జీఎస్ఆర్ కృష్ణమూర్తి, శలాక రఘునాథశర్మ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: హౌసింగ్ బోర్డులో ఇతర ప్రాంతాల్లోని చెత్తను తెచ్చి పడేస్తుండటంతో అపరిశుభ్రత ఏర్పడుతోంది. **- హరిప్రసాద్**

సమస్య: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తను తొలగిస్తాం.

సమస్య: గుల్జార్‌పేటలో ఎక్స్7/బీ4 స్తంభంతో పాటు మరో నాలుగు చోట్ల వీధిలైట్లు వెలగడం లేదు. **- రఘు**

సమాధానం: లైట్లు వెలిగే విధంగా చర్యలు చేపడతాం

(పై ప్రశ్నలకు నగరపాలక డీఈ దాక్షాయిణి, నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు)

సమస్య : రుద్రంపేట పంచాయతీ పరిధి చైతన్య కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. **- సంజమ్మ, స్థానికురాలు**

సమాధానం : వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- హిదయతుల్లా, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, అశోక్‌నగర్, రుద్రంపేట.

పిల్లలపై వివక్ష అమానుషం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అభం, శుభం తెలీని చిన్నపిల్లలపై సైతం కుల వివక్షత చూపించడం అమానుషమని ఏపీ ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. బ్రహ్మసముద్రం మండలం పి.కోడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోకి దళితుల పిల్లలను లోపలికి అనుమతి ఇవ్వకుండా.. బయటే నిలబెట్టడం అన్యాయం... అత్యంత దారుణమని అన్నారు. దీనికి కారణమైన వారిపై ఎస్సీ,ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మట్కా బీటర్ల అరెస్టు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని పాతూరు బోయగేరిలో మట్కా నిర్వహిస్తున్న శ్రీనివాసులు, యల్లయ్యలను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,950 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదకరంగా కల్వర్టు

రామ్‌నగర్ రెండో క్రాస్ నుంచి మూడో క్రాస్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టుపై ఉన్న పలకలు తరచూ ధ్వంసం అవుతున్నాయి. తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తుండటంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మళ్లీ ఇక్కడ పలకలు ధ్వంసం కావడంతో స్థానికులు ప్రమాద సూచికగా ఎండుకొమ్మలు పెట్టారు. శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. **- ఈనాడు, అనంతపురం**



కల్వర్టుకు మరమ్మతు చేయరూ!

రామచంద్రనగర్ చర్చికు వెళ్లే దారిలో కల్వర్టు మరమ్మతుకు గురైంది. కాలువలో నీరు అస్తవ్యస్తంగా పారుతోంది. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రిళ్లు ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కల్వర్టుకు మరమ్మతు చేసి మురుగు నీరు సక్రమంగా పారేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

- రామ్‌నగర్, న్యూస్‌టుడే

గొప్ప ఆశయం.. ఆచరణలో లోపం

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించండి.. అమ్మ పేరుతో మొక్కల పెంపకం చేపట్టాలని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్న కొంతమంది అధికారుల్లో ఏ మాత్రం మార్పు రావడం లేదు. రోడ్డు మధ్యలో నగర సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు లేక వెలవెలబోతున్నాయి. సూర్యనగర్ రోడ్డు, ఐరన్ బ్రిడ్జ్ వద్ద 10 ఖాళీ కుండీలు ఉన్నాయి. మళ్లీ మొక్కలు నాటి సంరక్షించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.



- న్యూస్‌టుడే, అనంతపురం (కమలానగర్)

గర్భస్థ లింగ నిర్ధారణ చేస్తే జైలుకే

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాల్లో గర్భస్థ లింగ నిర్ధారణ చేసినట్లు రుజువైతే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ.బి. దేవి తెలిపారు. శనివారం అనంతపురంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. స్కానింగ్ కేంద్రాల్లో పరీక్ష చేయించుకోవడం అమ్మాయా, అబ్బాయా? అని అడిగిన వారు, తెలిపిన వారు ఇద్దరూ శిక్షార్హులేనని తెలిపారు. దీనిపై అవగాహన ఫ్లెక్సీలను స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులు, కోర్టులు, బస్టాండ్, రైల్వేస్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలు, రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్థానికులతో కలిసి ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఫైనల్‌కు ఎస్కేయూ కళాశాల జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్ కళాశాలల గ్రూప్-బి బాస్కెట్‌బాల్ పోటీల ఫైనల్‌కు ఎస్కేయూ కళాశాల జట్టు దూసుకెళ్లింది. శనివారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల సిమెంటు కోర్టులో జరిగిన సెమీఫైనల్ పోటీలో ఎస్కేయూ కళాశాల జట్టు 24-18 పాయింట్ల తేడాతో ఆర్ట్స్ కళాశాల జట్టుపై సంచలన విజయం సాధించింది. అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీల్లో తొలిసారిగా ఎస్కేయూ కళాశాల జట్టు ఫైనల్ చేరింది. హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్ పోటీలో ఎస్కేయూ క్రీడాకారులు విజృంభించడంతో వరుస పాయింట్లు లభించాయి. క్వార్టర్ ఫైనల్ పోటీలో ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల జట్టు ఎస్వీ డిగ్రీ కళాశాల జట్టుపై ఘన విజయం సాధించింది. అలాగే తైక్వాండో, షటిల్ బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. ఆదివారం సెమీఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, కార్యదర్శి నిర్మలమ్మ, ప్రిన్సిపల్ ప్రభాకరరాజు, ఎస్కేయూ క్రీడా మండలి కార్యదర్శి జెస్సీ, పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.



హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

ఫుట్‌బాల్‌లో ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్ శుభారంభం

అనంతపురం క్రీడలు: జాతీయ స్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీల్లో ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్ జట్లు శుభారంభం చేశాయి. శనివారం అనంత క్రీడాగ్రామం ఫుట్‌బాల్ మైదానంలో జరిగిన రెండు పోటీలు ఏకపక్షంగా జరిగాయి. ఉదయం ఒడిశా జట్టు లద్దాఖ్ జట్టును 7-0 గోల్స్ తేడాతో మట్టి కరిపించింది. మధ్యాహ్నం అరుణాచల్ ప్రదేశ్ జట్టు 8-0 గోల్స్ తేడాతో మధ్యప్రదేశ్ జట్టును చిత్తుగా ఓడించింది.

కార్మికుల డిమాండ్లు పరిష్కరిస్తాం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరపాలకలో పని చేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని కమిషనరు నాగరాజు హామీ ఇచ్చారు. శనివారం కార్మిక సంఘాల నేతలతో నగరపాలకలోని కమిషనర్ ఛాంబర్లో చర్చలు నిర్వహించారు. కార్మికులకు క్రమ పద్ధతిలో పనిముట్లు ఇవ్వాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని నేతలు కోరారు. ఆందోళనలు విరమించాలని కమిషనరు సూచించారు.

సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టండి

ఆత్మకూరు, రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని చెరువుల కింద ఉన్న సాగునీటి కాలువల మరమ్మతులకు సత్వరమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పేర్కొన్నారు. మండలంలోని తలుపురు గ్రామంలో, రాప్తాడు మండలంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బస్సుజాత కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో అనేక చెరువులకు నీరందే వంకలు, వాగులతోపాటు చెరువు ఆయకట్టు కింద ఉన్న కాలువలు దెబ్బతిన్నాయన్నారు. పలు చోట్ల పూడిక, ముళ్ల పొదలతో నిండిపోయాయన్నారు. పీఏబీఆర్ ద్వారా మండలంలో అవకాశం ఉన్న చెరువులు, కుంటలకు నీరందించాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.



హంపాపురంలో దెబ్బతిన్న ద్రాక్ష పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ప్రాంతం: మారుతినగర్	పరిధిలోకి వచ్చే కాలనీలు: వెంకట్రావ్‌నగర్, మంగళవారి కాలనీ, సంగమిత్ర కాలనీ, నల్లపరెడ్డి కాలనీ, ఆదర్శకాలనీ, మారుతీనగర్	శివారు నివాసాలు: 4018	జనాభా: 12367	డివిజన్లు: 34,35

మారుతీనగర్లో సమస్యల మోత!

మారుతీనగర్, న్యూస్‌టుడే : మారుతీనగర్‌లో సమస్యల మోత వినిపిస్తోంది. అంబేడ్కర్ ఉపరితల వంతెనకు ఒకవైపున మారుతీనగర్ మరో వైపున రాంనగర్ ఉంటాయి. ప్రధాన రోడ్డు నుంచి కిలోమీటరు పైగానే పలు కాలనీలు శివారు విస్తరించాయి. పలు దుకాణాలతోపాటు ఆసుపత్రులు, బ్యాంకులు, హోటళ్లు ఉండటంతో పాటు ఆవాసాలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన నివాసాలకు, ఇప్పటికే ఉన్న నివాసాలు, దుకాణాల రూపంలో పన్నులు వసూలు చేస్తున్నా అక్కడ సౌకర్యాలు కల్పించడంలో నగరపాలక చొరవ చూపడం లేదు.

అంతర్గత రోడ్లు అధ్వానం



కొన్ని ప్రాంతాల్లో రోడ్లు వేసినా మరికొన్ని ప్రాంతాల్లో విస్మరించారు. గతంలో వేసిన రోడ్లు దెబ్బతిన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో వీధుల్లో రోడ్లు లేక నివాసాల వద్ద ఇబ్బంది పడుతున్నారు. గుంతలు పడిన రోడ్లలోనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షం వస్తే పలు లోతట్టు ప్రాంతాల్లో మురుగు అంతా నిలబడుతోంది. ప్రధాన రోడ్డులో సచివాలయం, పట్టణ ఆరోగ్య కేంద్రం, ఆలయాలు, నివాసాలు ఉన్నాయి. వర్షానికి బురద అంతా నిలబడి ఇబ్బంది పడుతున్నారు.



విద్యార్థులకు ఇబ్బందులు

మారుతీనగర్ శివారులో సాయిబాబా ఆలయం నుంచి శ్రీనగర్ కాలనీ కూడలి వరకు అర కిలోమీటరు మీర రోడ్డు దారుణంగా మారింది. ఇదే దారి ద్వారా జాతీయ రహదారికి వెళ్లడానికి అవకాశం ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. గుంతలతో వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇదే ప్రాంతంలో పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ఏ గుంత ఎంత లోతు ఉందోనని ద్విచక్ర వాహనదారులు భయపడాల్సి వస్తోంది.

ఉర్దూ భాషాభివృద్ధికి, సాహిత్య సేవలకు పురస్కారాలు

అశోక్‌నగర్ (అనంత సంక్షేమం), న్యూస్‌టుడే: ఉర్దూ భాషాభివృద్ధికి, సాహిత్యానికి విభిన్న రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాలు అందివ్వనున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ అబ్దుల్ హక్ పేరుతో జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైన వారికి రూ.1.25 లక్షలు, ప్రాంతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైన వారికి రూ.లక్ష నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేస్తారు. రాష్ట్రానికి సంబంధించి ఉర్దూ సాహితీ వేత్తలకు, పండితులకు, కవులు, పాత్రికేయులకు విమర్శ, పరిశోధన, గద్య బోధన, ఉర్దూ సేవలకు ఆరుగురికి జీవిత కాల సాఫల్య పురస్కారాలు అందజేస్తారు. భాషాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు, ఉర్దూ భాషలో అత్యున్నత శ్రేణిలో రాణించిన విద్యార్థులకు పురస్కారం అందజేస్తారు. పూర్తి చేసిన దరఖాస్తును ఈనెల 25 లోగా విజయవాడలోని రాష్ట్ర ఉర్దూ అకాడమీ కార్యాలయానికి పంపాలన్నారు. నవంబరు 11న జాతీయ విద్యాదినం సందర్భంగా పురస్కారాలు అందజేస్తారన్నారు.